శ్రీరస్తు.

ఆనిబిసెంటుగారిజీవితము

వా. వేంకటేశ్వరులచే

సంపాదితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1920.

ఆంధ్ర గ్రంథములు.

		ప్రతి 1-కి రూ.	అ.
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశతఘంటము. వేంకటరంగశాస్త్రిగారిది	...	7	0
శ్రీవివేకానందవిజయము	...	1	12
ప్రాచీనదేశచరిత్రలు	...	1	12
భారతరమణీమణులు	...	0	12
శ్రీమహాభక్తవిజయము	...	4	0
సంగ్రహరామాయణము, శ్రీశేషాద్రిశర్మకృతము		0	10
సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము		1	4
దశకుమారచరిత్రము, శ్రీ ఎనమచింతల. సంజీవరాయశాస్త్రికృతము	...	1	8
దక్షిణాపూర్వకథలు. శ్రీసీతారామశాస్త్రికృతము		1	8
భోజకాళిదాసకథలు, 1-వ భాగము	...	0	12
మైరావణచరిత్ర	...	0	2
రేచుక్కపగటిచుక్క కథలు	...	0	3
మర్యాదరామన్నకథలు, చక్కనిహాస్య	...	0	2
సత్యసేనవిజయము, కో. అనంతాచార్యకృతము		0	4
ఈసబునీతికథల, కో. [illegible] 1-వ భాగము		0	6
డిటో 2-వ భాగము		0	8
షేక్స్పియర్ నాటకకథలు, సులభశైలి	...	1	8

శ్రీరస్తు.

ఆనిబిసెంటుగారిజీవితము

వా. వేంకటేశ్వరులచే

ననూదితము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచేఁ

ప్రకటితము.

1920.

Printed by
V. RAMASWAMY SASTRULU & SONS
at the "VAVILLA" PRESS,
MADRAS.—1920.

పీఠిక

"పరోపకారార్థమిదంశరీరమ్" అనునార్యోక్తి ననుసరించి స్వలాభైకపరాయణత్వమును త్యజించి తమబుద్ధిబలమునుసర్వస్వమును జనసామాన్యాభివృద్ధికి ధారపోసి తామొనర్చుకార్యములఫలము భగవదర్పణంబు గావించుచు లోకోపకారమునకై సంచరించు పుణ్యాత్ములు కృతాదియుగంబులలోనైన నరుదుగ నవతరింతు రన నిక్కలికాలంబున మిక్కిలి యరుదుగఁ బొడసూపుదురని వేఱె వక్కాణింపఁబనిలేదు. ఇట్టిపరోపకారధురీణు లందఱును సామాన్యముగఁ బురుషపుంగవులే నైయున్నారు. ఈయంశముల నెఱిఁగిన పిదప శ్రీమదనిబిసెంటుదొరసానిచరిత్రఁ బరికించినచో నయ్యది యద్భుతప్రమోదావహముగఁ బొడకట్టక మానదు. కేవలము ధనమే దైవముగఁజూచు పాశ్చాత్యులమధ్య జన్మించి వ్యయప్రయాసముల కోర్వఁజాలనియబల యయ్యును జన్మదేశంబును విడనాడి దేశదేశంబులఁ దిరుగుచుఁ దనపూర్వజన్మసంస్కారవశమున లభించిన పరమాత్మజ్ఞానమునుసులభముగఁదెలిసికొనఁదగినమార్గములను బోధసేయుచు జనులకు నైహికాముష్మికసుఖసంపాదనమునకుఁ ద్రోవఁ జూపి లోకహితంబుగ సంచరించుచున్నయీసాధ్వీమణి చరిత్రము సర్వజనాదరణీయమై యద్భుతామోదములఁ గలిగించుననుట కేమి యాశ్చర్యము?

లోకకుటుంబమునఁ బెరుగుచున్న సమస్తజనులను దనకుఁ దోఁబుట్టువులభంగి నరసికొనుచున్న దయ్యాను, ఈకరుణార్ద్రహృదయ మనభరతఖండవాసుల దెస నించుక పక్షపాతమునఁ బ్రవర్తించుచున్నట్టు లీయమ యొనరించు కార్యములే వేనోళ్ల నుద్ఘోషించుచున్నవి. దీనికిఁ గారణము లేకపోలేదు. మనపూర్వగ్రంథరాజములను జదివి మనహిందూదేశముయొక్క పూర్వనాగరికతను, ఔన్నత్యమును, మహోన్నతభావమునుఁ దెలిసికొని యట్టి దశపోయి యిట్టిహీనస్థితికి వచ్చియున్న యీదేశమును గాంచి జాలిఁగొని మఱల దీనిని ఉన్నతస్థానమునకుఁ దెచ్చుతలంపునఁ దనశక్తియుక్తులలోఁ జాలభాగము నీదేశక్షేమాభివృద్ధికై వినియోగించుచుండెను. అట్టి యీమె పవిత్రచరిత్రమును ఆంధ్రదేశీయుల యుపయోగార్థమై యిందు సంగ్రహముగఁ బొందుపఱచుచున్నాను.

శా. శ్రీమంతమ్ము సనాతనమ్ము మునిసంసేవ్యమ్ము సాంసారిక
వ్యామోహాత్ములకందరానిది యుదగ్ధ్యానించు విజ్ఞానికిన్
క్షేమమ్మిచ్చెడు నట్టిదైన యలశ్రీ కృష్ణాఖ్య మా తేజమెం
తేమాన్యాత్మకు యాబిసంటుదొరసానిం గూర్చి భాసిల్లుతన్!

ఈగ్రంథము పునర్ముద్రణము చేయుటలో నాకు సహాయపడిన నా మిత్రులు శ్రీవిష్ణుభట్ల సూర్యనారాయణ, బి. ఏ; బి. ఎల్; గారి కెల్లప్పుడును కృతజ్ఞుఁడను.

వావిళ్ల వేంకటేశ్వరులు.

శ్రీ ర స్తు.

అనిబిసెంటుగారి జీవితము.

మొదటి ప్రకరణము.

తల్లిదండ్రులు, జననము, విద్యాభ్యాసము, వివాహము.

అనిబిసెంటు క్రీ.శ. 1847–వ సంవత్సరమున జననమొందినది. ఇంగ్లాండుదేశ మీమెజన్మస్థానము. లండనుపట్టణమున గొప్పడాక్టరుగానుండిన 'విల్లియమ్. పెజ్‌వుడ్' అను నాంగ్లేయపండితుఁ డీమెజనకుఁడు. ఇతర వైద్యశాస్త్రజ్ఞులవలెఁ గాక యీయన వేదాంత గణిత శాస్త్రములయందును సాహిత్యమునందును మిక్కిలి సమర్థుఁడు.

ఈమె తల్లి ఐర్లాండు దేశమున జన్మించిన యొక "ప్రొటెస్టెంటు" మతస్థురాలు. చిన్నతనమునుండియుఁ దన తల్లి యాజ్ఞలో మెలఁగుచు వచ్చినందున నీమె చాలవఱకుఁ దనతల్లిగుణముల గ్రహించియుండెను.

ఈయమ "మిస్ మేరియట్" యను నామెయొద్ద విద్యాభ్యాసము ప్రథమమునఁ జేసెను. ఈయుపాధ్యాయురాలు బ్రహ్మచర్యవ్రతమును బూని యుండుటచేతను శిష్యులకు

బోధింప సహజనిపుణత్వము గలిగియుండుటచేతను, దాను జేయఁబూనినకార్యమును మిగుల నుత్సాహముతో నెఱవేర్చు స్వభావముగలిగి యున్న దగుటచేతను, దనధర్మములను నిరాక్షేపముగఁ గొనసాగించుకొన సమర్థురాలై యుండెను. ఒక్క సంగీతశాస్త్రమును దక్కఁ దక్కిన సమస్తవిద్యలను ఈ యుపాధ్యాయురాలే అనిబిసెంటుదొరసానికి బోధించినది. బోధకురాలియొద్ద విద్యాభ్యాసము చేయుటచే అనిబిసెంటుకు శాస్త్రపాండిత్యము కుదురుటయే గాక శాస్త్రాభ్యాసమునం దవ్యాజప్రేమయుఁ బొడమెను. బిసెంటు ఈ శిక్షకురాలితో దేశయాత్రకు వెడలి ఫ్రాన్సు, జర్మనిమున్నగు దేశములకుఁ బోయి యాయాదేశ భాషలలోఁ జదువుటకును మాటలాడుటకును శక్తిని సంపాదించుకొనెను. ఇంతమాత్రమే కాక యీ దేశాటనముచే నీమెకు స్వతంత్రించి యూహించుటకును బని చేయుటకును దగినసామర్థ్య మలవడెను.

ఈసాధ్వి పదునాఱేండ్లవయసు రాకమునుపే విద్యలఁ దుదముట్ట నభ్యసించి తనతల్లిగృహమునకుఁ బోయెను. తల్లియు నీమెనత్యాదరముతో గారవించి తనమాతృభావమును విశదీకరించుకొనెను. ఈమె 1866-వ సంవత్సరమున "ఫ్రాంకు బెసంటును" ప్రథమమునదర్శించెను. ఈయన కేంబ్రిడ్జి సర్వకలాశాలలోఁ బరిపూర్తిగవిద్యనభ్యసించివచ్చి యప్పుడే యొక క్రైస్తవ మతాలయములో మతోపాధ్యాయుఁడుగాఁ బ్రవేశించెను. అమఱుసటి సంవత్సరముననే అనిబిసెంటు ఈ యౌవనవంతుని వివాహమాడెను.

రెండవ ప్రకరణము.

ఈ వివాహమువలనఁ గలిగిన చిక్కులు, మనోవిభ్రమములు, మతవిషయములం దపనమ్మక మారంభించుట, భర్తతో నెడబాటు.

ప్రపంచయాత్రలోని కష్టములేవియుఁ దనకూఁతునకుఁ దెలియకుండఁ దానే భరించుచు మిగుల ప్రేమార్ద్రహృదయమున గారవించు తల్లిపోషణలో నుండియుండుటచే బెసెంటు దొరసానికి నింతదనుక సంసారసాగరములోని యల్లకల్లోలములఁ దెలిసికొనుట కేమియు నవకాశము లేకపోయెను. ఈ దంపతు లిరువురును దామొండొరుల యెడ నెఱవేర్పవలసిన ధర్మములవిషయమై భిన్నాభిప్రాయులై యుండుటయే కాక యనుకూలదాంపత్యమునకు విరుద్ధ లక్షణములు గలవారై యుండిరి. అయినను, ఈసుప్రసిద్ధురాలు తనకిఁక నీసంసారమున జీవయాత్ర చేయుట కష్టతమమని తోఁచునంతవఱకుఁ దన విధాయకకృత్యముల నిర్వర్తింపఁజేయుచు గృహనిబంధనలనుండి తప్పించుకొనఁజూచుటకు మిగుల శంకించుస్వభావము గలదికాని బెసంటు ప్రతివిషయమునను తనయాధిక్యతను చూపింపవలయునను స్వభావముగలది. ఈయమ సామాన్యపుమూఢవనితవలె భర్త చెప్పినదియే వేదమని యంగీకరించునది కాదు. కాఁబట్టి యిట్టివ్యత్యాసములైన యభిప్రాయములు గలిగియున్న యీదంపతు లిరువురును బొత్తుగఁ గాపురము సేయఁజాలరైరి. ఒకానొక సందర్భమున బెసంటు యీవిష

యమును గూర్చి యిట్లు ప్రసంగించినది. "నాభర్తయొక్క వేఱువిధమైన నడవడియే నన్నుఁ గ్రమక్రమముగ లోకనిర్ణీత నిబంధనల ననుసరించుదానిఁగాఁ జేసియుండినను మొదటి నుండియు నేను నాభర్తకు మిక్కిలి యతృప్తికరమైన భార్యనై యుండియుందును."

ఈగృహకలహము లిటులుండఁగా నీమె 1869-వ సం|| జనవరినెలలో నొక మగశిశువును, 1870 వ-రం|| ఆగష్టునెలలో నొక యాఁడుశిశువును గనెను. 1871 వ-సంవత్సరమున నీ శిశువులిరువురును కోరింత దగ్గుచేఁ జాల బాధితులైరి. తన్కాలమున బెసంటు చాల ప్రయాసమునకులోనైనది. అప్పటి నుండియు నామె మనస్సునఁ గ్రైస్తవమత బోధయందలి నమ్మకము తగ్గిపోవుటకారంభమైనది. తన పిల్లలజబ్బుకుదరక యుండు స్థితిలో నీమెకు జబ్బు తటస్థించెను. ఇందుచే మూఁడు సంవత్సరములు బాధపడెను. ఆసమయమున తన బాధను తలఁచుకొనినచో మిక్కిలి ; భయంకరముగా నుండెడి దనియు, నాపడిన యమబాధయే తన మతాభిప్రాయములను మార్చివైచి నాస్తికవాదమునకుఁ దన్ను మరల్చె ననియు "నేనీమధ్య చాలవఱకు బీదలతోఁ గలియుచుంటిని, వారనుభవించు మితిలేని బాధలఁ జూచుచుంటిని. నాకాదర్శపూర్వకమగు తల్లిని ఆమె నమ్మిన యొక న్యాయవాది మోసపుచ్చి ఆమెను అప్పులపాలుచేసెను. ఆశాపూరితమగు నాచక్కని జీవితమును భరింపఁజాలని బానిసత్వము చెడఁగొట్టెను. నాకష్టము లన్నింటి నెవరిపై నాధారపఱచుకొని యుంటినో అట్టి నా

ముద్దులబిడ్డ నన్ను బాధలకుపాలుచేసి నన్ను ఆధారము లేని దిగఁ జేసెను. దయామయుఁడని చెప్పఁబడు దైవముచే సృష్టింపఁబడిన యింతటి పాపమును, దుర్భరమైన కష్టమును, కాపట్యము లేనివారి హింసయు, విచారగ్రస్తమయిన ప్రపంచయాత్రయు, ఈ మనోబాధయు, ఇవి నాయందు నిరాశ పుట్టించినవి. నాకు నమ్మకము తగ్గినది. అప్పటికి నేను కేవలము నాస్తికమతము నవలంబింపకయున్నను నానమ్మకముమాత్రము చాలచలించెను,'' అని తనస్వీయచరిత్రగ్రంథమున వ్రాసియున్నది.

ఈమె కీసమయమున నొక మతగురువును, వైద్యుఁడును సహాయులుగ నుండిరి. ఈకష్టసమయము గతించిన పిదప తనమనఃపూర్వకముగ నుండు మతవిషయములఁ గూర్చి మాత్రము నమ్మకమును సూచించుట మానెను. ప్రతి విషయమును దళించి పరిశీలనసేయు నీమెకుఁ గ్రైస్తవమతవాదము లన్నియు నసంబద్ధములుగఁ బొడకట్టసాగెను. పిదప క్రమముగ నీప్రపంచమున దుర్మార్గతయు, బాధయు నేలయుండవలయును? వీని నిర్మించిన దైవము సంపూర్ణప్రేమమయుఁడై యుండుట పొసఁగునా? ఇత్యాది తలంపులు పుట్టసాగెను. ఈవిషయములకుఁ దగిన సమాధానముల నిచ్చుటకుఁ గ్రైస్తవమత బోధకులెవ్వరును సహకారులు గాలేరు. ఇట్టిసందేహముల నివారణ చేయఁజాలినది మన హిందూమత మొక్కటియే. కావుననే బెసంటుదొరసాని తుదకు మనహిందూమతము నవలంబించినది.

అయినను మనము వ్రాయఁ బూనుకొన్న కాలమున నామెకు నీశ్వరుని యునికినిగూర్చి యెట్టి సందేహమునులేదు. ఆకాలమున నీమె ఈశ్వరజ్ఞాన సంపన్నుఁడైన "ఛార్లస్ వాయసీ" దొరతో స్నేహముచేసి కలఁతల నొందిన తన మనస్సునకుఁ గొంచెము కుదురుపాటును గలిగించుకొనెను. అప్పటి నుండియు నీమెకు క్రైస్తవమతమునందలి నమ్మకము బొత్తుగాఁ బోయినది.

1872 సం॥ నీమె స్కాటు దొరతోడను వానిదొరసాని తోడను స్నేహముచేసి వారిగృహమున యథేచ్ఛముగా నీశ్వర జ్ఞానమును సంపాదించుకొనుటకు జరుపఁబడు సభలకుఁబోవుచుండెను. స్కాటు ధనవిద్యాసంపన్నుఁడు. ఆయన ప్రచురపఱచు మాసపత్రములలో నీమె నిర్బంధరహితములైన యుద్దేశములఁ గూర్చి వ్రాయుచుండెను. ఈవిధముగ క్రైస్తవమతసిద్ధాంతములకు బోధనలకును, నిబంధనలకును వ్యతిరేకమగు నభిప్రాయములుగలిగిన యీమె 'చర్చి' నిబంధనల కనుగుణముగ నడుచుటమానెను. బెసంటుదొర యీమార్పుల నొక్కింతయైన సమ్మతించినవాఁడుకాఁడు. కావున బెసంటుదొరసానికి తనభర్తనుండి విడుదలపత్రమును బుచ్చుకొనుటకంటె వేఱుమార్గమేమియు లేకపోయెను. ఈమె మనస్సున నొక్కటిపెట్టుకొని పైకింకొకవిధమున సంచరించు స్వభావము గలదిగాదు. కావున బెసంటుదొరసాని తనయిరువదియాఱవయేట తనభర్తనుండి యథావిధిగ వేఱయిపోయినది. అప్పటినుండి 1874 సంవత్సరము మే నెలవఱకు నామె న్యాయపథమును దప్పక తనచేత

నైనకార్యమును గావింపుచు దానివలన వచ్చు మితమైన యాదాయముతో తనబిడ్డలను, తల్లిని, తన్ను రక్షించుకొనుచు వచ్చినది.

మూఁడవప్రకరణము.

ఇట్టియసహాయస్థితిలో నుండినయీమెకు స్కాటు దొర దొరసానియుఁ దమసహాయసంపదను జూపి యాదరించిరి. ఈమె వారి పుస్తకభాండాగారమునకుఁ బోయి, జ్ఞానసంపాదనముఁ జేసికొనుచు, వారిమాసపత్రికలకు విషయముల వ్రాసియిచ్చుచుఁ దన్మూలమున లభించు కొద్దిపాటి యాధారముతోఁ గాలక్షేపముఁ జేయుచుండెను. అంత శీఘ్రకాలమున మనస్సులోని యాందోళనములచే నీశ్వరునియందలి నమ్మకము లన్నియుఁ బోయి యామెబుద్ధి నిరీశ్వరవాదమునకుఁ దిరిగెను. ఇట్టిసమయమున నీమెకు "చార్లస్ బ్రాడ్లా" దొర స్నేహము కుదిరెను. అటుపిమ్మట నాతఁడధ్యక్షనాధిపత్యమును వహించియున్న జాతీయమతసంఘమున కీమె చేరినది. బ్రాడ్లా దొరస్నేహమును గూర్చి యీమె యిట్లు వ్రాసికొనియున్నది.— "ఈజన్మమునఁ గలిగిన యిప్పటిమా స్నేహము మాపూర్వజన్మముల మాయొకరియెడ నొకరికిఁ గలిగినయనురాగమునకుఁ బర్యవసానమైయున్నది."

బిసంటుదొరసాని 1874సం॥ అగస్టునెల 25-వ తేదీని తనయభిప్రాయములఁ గూర్చి బహిరంగముగ నుపన్యాసముల నిచ్చుటకుఁ బ్రారంభించినది. ఆమె నీవిషయములఁ గొన్నిచోట్ల

నుపన్యసించుసమయమున నామె ప్రతివాదు లాసభాభవనము లపై రాళ్లు రువ్వియుమట్టియు ననేకవిధముల నల్లరిచేసియు నామె నవమానింపఁజూచిరి. 1875 సంవత్సరమున జాతీయమత సంఘమున కామె యుపాధ్యక్షత్వము వహించినది. తుద కీశ్వర జ్ఞానబోధకసంఘములోఁ జేరుటకు నీమె యుపదవిని విడువలేదు.

1877-వ సంవత్సరమున నీమె జాతీయసంఘసంస్కారిణి యనుపత్రికకు బ్రాడ్లాదొరతో సమానాధిపత్యము వహించినది. ఆసంవత్సరముననే ఆమెయు బ్రాడ్లాదొరయును నోల్టను పత్రికను ప్రచురించుటచే దొరతనమువారిచే నేరము మోపఁబడి చాలవ్యయప్రయాసలకులోనైరి. అమెరికాలోని వైద్యశాస్త్రజ్ఞుఁడైన "నోల్టను" దొర జనాభివృద్ధికి మితి లేకున్నదనియును దానిఁ దగ్గించుటకుఁ బ్రతికుటుంబమువారును వీలైనంతవఱకు స్వభావవిరుద్ధములగు కార్యములచే శిశువుల యుత్పత్తిని దగ్గించవలయు ననియును ఒకపత్రికను బ్రచురపఱచెను. దానిని అనిబిసెంటు దొరసానియు, బ్రాడ్లాదొరయు నింగ్లండులోఁ బ్రచురించిరి. దీనికిఁగాను దొరతనమువారు నేరముమోపుటచే నీస్నేహితులిరువురును చాలవ్యయప్రయాసములకు లోనైరి. కాని చివరకు నీనేరమునుండి జయప్రదముగా విడుదలచేయఁబడిరి. కాని పాపము ఈమె తన శిశువులనుఁ గొనిపోయి తననుండి వేరైన తనభర్తయధీనము చేయునటుల దొరతనమువారి యాజ్ఞయగుటచే నీమె తనపసిబిడ్డల యొడఁబాటున కోర్వఁజాలక చాలదుఃఖించి తుదకు మిక్కిలి

జ్వరపీడితురాలయ్యెను. ఇట్టి విపత్సమయమున నీమెకు ధైర్యమును జెప్పుచు నుపచారమును జేయుచు బ్రాడ్లాదొరతన స్నేహభావమును గనఁబఱచెను. ఈవిషయమును గూర్చి వ్రాయుచో "ఆయన నాప్రాణములను గాపాడెను" అనియామె వ్రాసికొనియున్నది. ఆత శరీరమునకుఁ గొంతబలము చేకూరినపిమ్మట నామె వ్యాయస్థానవ్యాజ్యముచేసి తన పిల్లలను రాఁబట్టుకొనవలయునని యత్నించెను. కాని దేశప్రచట్టముల ననుసరించి యామె భర్తయే జయము నొందెను. అటుమీఁద నామె యప్పుడప్పుడుపోయి తనపిల్లలను జూచి వచ్చుచుండెను గాని యట్లుచేయుటచేఁ దనమీఁది ప్రేమమున వారెక్కుడ బెంగపెట్టుకొని దుఃఖింతురని యనుచింతచేనట్టుపోయి వారలఁ జూచుటకూడ మానివేసెను. ఈవిషయమును గూర్చి యామె యిట్లువ్రాసికొనెను. "వారిని దుఃఖమునుండి తొలఁగించు తలంపుతోన నేను వారిఁ జూడఁబోవ మానుకొంటిని, నాకడుపునఁ బుట్టినబిడ్డ లీవిధమున నాహస్తములనుండి యపహరింపఁబడఁగా నేను దిక్కుమాలిన పిల్లల నాదరిని మాతృవాత్సల్యతతోఁ జూచుకొనుచు నాచేనైన సహాయములఁ జేసి వారలబాధలఁ దొలఁగించుచు నాహృదయతాపమును బోఁగొట్టుకొన మనోనిశ్చయమును జేసికొంటిని."

ఈసేవనమునాలోచించుటకు ఫలితముగ 'మాల్తూసియన్' సంఘమొకటి బిసెంటుగారి కార్యదర్శిత్వముగలదై స్థాపింపఁబడెను. ఈసంఘమువారి యుద్దేశములను 'నేష్టను' పత్రికలో ప్రకటింపఁబడిన యుద్దేశములను నొకటేను. వీరును,

వీరియుద్దేశములతో నేకీభవించువారలును, వీరి దుస్థితిలో సహాయులుగా నున్నవారును ఈపైనేరము తెచ్చినవారికే సహాయముచేయఁ బ్రారంభించిరి. ఇట్టి నేరమారోపింపజేయఁబడి నప్పుడు "జెస్నెట్" అనునొకరు ఇంగ్లాండునకువచ్చిరి; అప్పుడొక సభ గావింపఁబడెను. అందు వెల్లడించిన యీ క్రిందిభావములు వారియుద్దేశములఁ బ్రకటించినవి. "వాక్స్వాతంత్ర్యము లేక నిజము పైకిరాదు. వాక్స్వాతంత్ర్యములేక నిజము బయలుపడినను అది నిరర్థకము. వాక్స్వాతంత్ర్యములేకున్న యభివృద్ధిక్షీణించును. భవిష్యత్కాలమున దేశౌన్నత్యమునకుఁ దోడ్పడునట్టి గొప్పయాశయముల నెలకొల్పుటకై ప్రజలు ముందంజవేయఁ జాలరు. వాక్స్వాతంత్ర్యము లేకున్న నత్యాదిపాడు కావింపఁబడుటయే మేలు. వాక్స్వాతంత్ర్యము లేకున్న జాతీయాశయములు నశించి ప్రజల జీవితములనే నశింపఁజేయును."

1878 సం॥ సెప్టంబరునెలలో శరీరారోగ్యము కలిగిన మీఁద స్వస్థచిత్తురాలై విధికృత్యముల నెఱవేర్చుటకు మరల ప్రారంభించెను. అప్పుడు ఇంగ్లాండునందలి "డిస్రెలి" మంత్రి ప్రభుత్వమును, ఇండియాందలి "లిట్టను" ప్రభుత్వమును నామెదృష్టినాకర్షించినవి. హిందూదేశవిషయమై సేవచేయుట కవకాశ మామె కలిగించుకొనుటకిదియే ప్రథమము. హిందూదేశస్థితి ఇంగ్లాండున నప్పుడు చర్చనీయాంశమై యుండుట చేతను, ఈమె జాతీయవాదినియగుటచేతను ప్రభుత్వస్థితిని తీవ్రముగ ఖండింపసాగెను. ఈదేశస్థితిగతులను, అందుల లోప

ములను చిత్రముగవర్ణించుచు ,వ్రాయఁబడిన "ఇంగ్లాండు, ఇండియా, ఆఫ్గనిస్థానము" అనుపుస్తకమీమె వాదతత్త్వము యొక్క సారాంశము. తానప్పుడు చేసినసేవనుగూర్చి పిదప నాయమవ్రాసినవాక్యములు ప్రశంసార్హములు. "ఆఫ్గనిస్థానముపై దండయాత్ర వెడలుట మొదలగు ఇతర దురాగతములఁ గూర్చి వ్యతిరేకముగను సుస్వభావముగలిగి స్వాతంత్ర్యాపేక్ష కలగు హిందువులపక్షమునను, నేనుగావించిన యుపన్యాసము లొకవిధమైన ప్రేమను వారిహృదయములయందు నెలకొల్పినది. మఱియునప్పుడు నాగావించినసేవయే ప్రస్తుతము హిందూదేశమున నాకాలక్షేపమును సూచించునట్టిసేవకు ప్రారంభమైనది."

1879-వ సంవత్సరమున నతనిశాస్త్రపరిజ్ఞానము పూర్తిగా వించికొనుటకై నిశ్చయించికొని "నాషనల్ సెక్యులర్ సొసయిటి" సభ్యుఁడును నింగ్లాండులోఁ బ్రసిద్ధిఁజెందిన వైద్యుఁడు నగు "ఆవర్జి" యొద్ద శిష్యురాలై యాసంవత్సరమున మెట్రిక్యులేషను పరీక్షయందు త్తీర్ణురాలై కొలదికాలముననే ఎనిమిదిశాస్త్రములయందు గొప్పగౌరవముల నంది బి. యస్. సీ., యస్. పీ. పరీక్షలయందు జయముగాంచెను.

1880-వ సంవత్సరమున బెసంటు బ్రాడ్లాకుఁ జాలసహాయమొనర్చినది. బ్రాడ్లాదొర నార్తాంప్టను పట్టణమువారిచే పార్లమెంటుసభకుఁ బ్రతినిధిగా నెన్నుకొనుటలోఁ దానును దోడ్పడియుండెను. మొదటఁ బ్రతినిధిత్వమును జెందినవారెల్లరును దమధర్మములను న్యాయముగ నెఱవేర్చెద మని

క్రైస్తవమత గ్రంథముమీఁద నొట్టుపెట్టుకొనవలసినది పార్లమెంటు ఆచారము. బ్రాడ్లాకు బైబిలుగ్రంథములో నేమియు నమ్మకములేదని యీపాటికే తెలుపఁబడెను. ఆకారణముచే పైయేర్పాటునకు బ్రాడ్లా ఒప్పుకొనలేదు. అందుచే బ్రాడ్లా ప్రతినిధిగా నుండుటకు వీలులేదని పార్లమెంటుసభ నిబంధన వారిని తొలఁగించెను.

బ్రాడ్లా యీవిషయమై యనేకోపన్యాసములనిచ్చి చర్చ గావించెనుగాని యేమియు లాభము లేకపోయెను. అప్పుడు నార్తాంప్టనుపట్టణమువారు చాల కోపించి గుంపులు గుంపులుగవచ్చి ఆసభాస్థానమునొద్ద గడబిడఁజేయుచుండ రక్షకభటులు కూడ నేమియుఁజేయుటకును దోఁపక నివ్వెరపడియుండిరి. అట్టిసమయమున వారివలన కేహానియుఁగలుగకుండ వారిని తనవాక్చాతుర్యమున నిలిపి సమాధానపఱచి బ్రాడ్లాకొరకును దొరతనపువారికిని బెసంటుదొరసాని చాల యుపకారమొనర్చినది. తరువాత నార్తాంప్టనుపురప్రజలు బ్రాడ్లాదొరను మరలఁ దమ ప్రతినిధినిగా నెన్నుకొనిరి. అప్పుడుకూడ బ్రాడ్లాదొర తొలఁగింపఁబడెను. అందుమీఁద దొరతనపువారికి సుంకముచెల్లింపవలసినపొగాకు సారాయి, మొదలగు పదార్థములఁ గొనకుండునటులను "సేవింగ్సుబాంకిలో మీరు దాఁచికొనినసొమ్మును దిరిగి పుచ్చుకొనవలయు"ననియును బెసంటుదొరసాని ప్రజలకు బోధింపఁగా నీమూలమున దొరతనమువారికి నచ్చు శిస్తులరాఁబడి తగ్గిపోయెను. అప్పుడు బ్రాడ్లాదొరను ప్రతినిధిగనంగీకరించిరి.

17

నాల్గవ ప్రకరణము.

1875-వ సంవత్సరమున నమెరికా ఖండవాసులైన "కర్నల్ ఆల్కాటు"దొరయును, "బ్లావెట్స్కీ"దొరసానియుఁ బరమాత్మ జ్ఞానసంపాదకసంఘమను నొక మతసంఘమును స్థాపించిరి. వారుస్థాపించినసంఘమే శాఖోపశాఖలుగఁ బ్రపంచమంతటను వ్యాపించి సర్వజనాదరణీయముగ అనిబిసెంటు దొరసాని యధ్యక్షత క్రింద నిప్పుడు శోభిల్లుచున్నది. చెన్నపురిలోని "అడయారు" ఈ మతసంఘముయొక్క ప్రధానకార్యస్థానము.

1882-వ సంవత్సరమున బెసెంటుదొరసాని ప్రప్రథమమున నీసంఘముతోడి సంబంధమునకు దిగినది. ఈమె యీ సంఘోద్దేశ్యములఁగూర్చియు సాంఘికులఁగూర్చియు నిరసన వాక్యములతో నధిక్షేపించుచు నొక యాంగ్లేయ మాసపత్రికలోఁ బ్రచురించెను. బ్లావెట్స్కీదొరసాని యీ యధిక్షేపములఁజదివి బెసంటుదొరసాని తమ సాంఘికోద్దేశ్యములఁగూర్చి పొరబాటగు నభిప్రాయముగలదై యట్లు వ్రాసియున్నది గాని వేఱుకాదని మృదురీతి సమాధానమిచ్చెను. అప్పటినుండి బెసంటుదొరసాని మనస్సు పలువిధములయిన కలఁతలకుఁ బాలయ్యెను.

1883-వ సంవత్సరమున 'అవర్ కార్నర్,' అను ఒకపత్రిక ఈమెమొదలుపెట్టెను. ఆదేశమునందలి "హెక్కెల్," 'షా' మొదలగు ననేకప్రముఖులు ఈ పత్రికకు వ్యాసములు వ్రాసి పోషించుచువచ్చిరి. ఆసమయమునసే బ్రాడ్లామీఁద మాననష్ట

మునకై యభియోగము తేఁబడి, బెసంటుదొరసాని యనవరత సహాయమునలనను, దైవకృపనలనను, నీయభియోగము బ్రాడ్లా దొరకనుకూలమయ్యెను. ఈ సందర్భమున నే సమష్టివాద తత్త్వము ఆమెమనస్సులోని యాందోళనమును వృద్ధిపఱి చెను. కొంతకాలమునకు ఈసమష్టివాదసూత్రములను గ్రహించెను. అప్పటినుండి రాజకీయవ్యవహారముల వదలి సాంఘికస్థితి నైతనదృష్టిని మరల్చి సంఘమును ఏరీతిన బాగుపఱుపవచ్చునా యని యాలోచింపసాగెను.

సమష్టివాదము సంఘమును సంస్కరణముచేయు నుద్యమములలో నొకటి లోకమున సృష్టింపఁబడిన ప్రతివ్యక్తియును సంఘమును బాగుచేయుటకే యనియు, ప్రత్యేకవ్యక్తిత్వము వల్లసంఘమున కనేకదోషములాపాదింపుచున్నవనియు, ప్రత్యేక వ్యక్తిత్వమునకంటె సంఘవ్యక్తిత్వమే ముఖ్యమనియును బెసంటుదొరసాని బోధింపమొదలిడెను. ఈసూత్రములన్నియు వ్యక్తివాదమునందలి సూత్రములకు భిన్నములేగాక యట్టివ్యక్తిత్వమును నశింపఁజేయుచున్నవి. అందువలన వ్యక్తివాదమునకును సమష్టివాదమునకును ప్రత్యక్షవిరోధము. బెసెంటు సమష్టివాదావలంబకురాలు. ఈమె ప్రియమిత్రుఁడగు "బ్రాడ్లా" వ్యక్తివాది. ఇందుచే వీరిరువురకు నభిప్రాయములు భేదించినవి. ఇంతటితో వీరిమైత్రి యంతరించునో యని యామెను కలవర పెట్టుచుండెను. కాని యిరువురును భిన్నాభిప్రాయములలో సమానభావమునుంచి మైత్రితో మెలఁగుచుండిరి. వీరితో మాత్ర మేగాక సమష్టివాదమువలన అభిప్రాయభేధముగల్గిన వారియందఱితోఁగూడ స్నేహముగ నేయుండెను. ఈ కాలముననీయమ

కర్మకారులస్థితినిగూర్చియు, వారిని బాధించుచున్న దారిద్ర్యమును గూర్చియు బాగుగ తెలిసికొని, వారికి సహాయముచేసి, వారిస్థితిని వృద్ధిఁజేయుటకై యనేక ప్రయత్నములుచేసెను. చేతిపనులు చేయువారియం దన్యోన్యమైత్రి సమకూర్చి వృథాకలహములకవకాశము లేకయుండున ట్లనేకసంఘములు స్థాపించెను.

ఆత్మనుగూర్చియుఁ బరమాత్మనుగూర్చియు నిశ్చితాభిప్రాయములఁ బొందుటకుఁ దనకున్న జ్ఞానము చాలదని తెలిసికొనసాగెను. వశీకరణశక్తి యోగదృష్టి మొదలగు సామర్థ్యములు గలవారు నేయువిచిత్రపుఁబనులకుఁ గారణ మూహించుటకు శక్తురాలుగాకుండెను. అప్పటినుండియు నీ ప్రపంచనాటకమునకు హేతుభూతములగు సూక్ష్మవిషయములఁ దెలిసికొనుటకుఁ గంకణము కట్టుకొని యనేకవిధములయిన గ్రంథములఁ బరిశీలించియు ననుభవముచేఁ బరీక్షించియుఁ దెలిసికొనుటకుయత్నించెను. మనస్సామర్థ్యమును ఆత్మప్రభావమునుగూర్చి తెలిసికొనవలయునని గట్టిపట్టుదలపట్టినయామెకు 1889-వ సంవత్సరమున నామెస్నేహితుఁడొకఁడు "బ్లావెట్స్కీ" దొరసాని రచియించిన "రహస్యమత"మను గ్రంథమునిచ్చి దానిని విమర్శింప వేఁడుకొనెను. ఆమెదాని నింటికిఁగొనిపోయి పరిశీలింపఁగా నందలివిషయము లామె మనోవిభ్రమముల నెల్లఁబోకార్చెను. ఆమె సందేహములన్నియు నాఁటితో నివర్తించినవి. ఆమెమనస్సు వికసించినది. నిర్భరానంద మామెమనస్సున నెలకొనెను. అంతట నామె దానిపై విమర్శను వ్రాసి తనస్నేహితునకిచ్చి యాగ్రంథకర్తతోఁ దనకుఁ బరిచయముకలుగఁజేసి

కోనవలయునని ప్రార్థించెను. అంతనాతఁడామెను బ్లావెట్స్కీ దొరసాని యొద్దకుఁ బిలుచుకొనిపోఁగా నామెయు బెసెంటు దొరసానికి స్వాగతమిచ్చి యత్యాదరముతో గారవించెను. అంతటితోఁ దామొనర్చినపనులఁగూర్చియు దేశసంచారమును గూర్చియు ముచ్చటించి బెసెంటుదొరసాని తమ మతసాంఘికు రాలైనచో మిక్కిలి శ్రేయస్సు సమకూరునని బ్లావెట్స్కీ దొర సాని వాక్రుచ్చెను. అందుపై బెసంటుదొరసాని యామెరచి యించిన గ్రంథములఁ జదివి యామె మాహాత్మ్యమున నిశ్చల మైన విశ్వాసముగలదై యాసంఘములోఁ దన్నుసైత మొక సభ్యురాలిగఁ జేర్చుకొని తన శిష్యత్వ మంగీకరింపవలయు నని బ్లావెట్స్కీదొరసానిని ప్రార్థించినది. బ్లావెట్స్కీదొరసానియెడ బెసాంటుదొరసానికత్యంతమైన గురుభావము. ఆమె నిర్వాణ పదవి నొందినపిదప బ్లావెట్స్కీ సంఘోద్దేశ్యములను, వాని నాచరించువిధులను బెసంటుదొరసానివలె నుబోధకముగఁ దెలుపఁగలవారు మఱెవ్వరును లేరు. ఈ విషయములఁగూర్చి యామె దేశదేశములనుపన్యసించుచున్నది. అనేకగ్రంథముల రచియించుచున్నది. ఈమె ప్రోత్సాహముచే నీ సంఘము ప్రపంచమునఁగల యన్నిదేశములలోనువ్యాపించి లోకమునఁ గల జనులకందఱకు నీమూలమున సంబంధమతిశయింపఁజేసినది. ఈ సంఘమునకు మూలస్థానమైన మన భరతఖండముకూడఁ జాల ప్రాముఖ్యముఁబొంది సర్వదేశములయందును గౌరవనీయ మైనపదవినందెను.

ఈమతమునుగూర్చి యీయమరచించిన గ్రంథములు.

పరమాత్మజ్ఞానమును గూర్చి యీయమరచించిన వ్రాతలు సుబోధకములై దుర్గ్రాహ్యములయిన యాత్మ విచారణ విషయముల సైతము సామాన్యపుజనులు కూడఁ జదివి సులభముగ గ్రహించుకొన ననువగు శైలిని వ్రాయఁబడియున్నవి. ఈమె వ్రాసినవిషయములఁ జూడఁగా నీమెకు వానియందుఁ గలిగిన దృఢమైన నమ్మకము తేటపడఁగలదు. అద్దానిఁజదివి యనుభవమునకుఁ దెచ్చుకొనిన ప్రతి మనుజుఁడు ఈప్రపంచ సంచారమునందు విచారశూన్యుఁడై మరణమునకు వెఱువక నిర్భరానందమును జెందుచు శాశ్వతపదవినిబొందుటకుఁ దగు సాధనముల సులభముగ సంపాదించుకొనఁ గలఁడు. ఈ విషయములఁగూర్చి యామె వ్రాసిన గ్రంథములు లెక్కకు మిక్కిలియై యున్నవి. ఆగ్రంథములన్నియు నాంగ్లేయ భాషలో వ్రాయఁబడియున్నది.

'పూర్వుల వివేక'మను నొక గ్రంథమున వ్రాసియున్నది. ఈమెచే ఇందీమతముయొక్క ముఖ్యోద్దేశ్యములు సంగ్రహముగ వ్రాయఁబడియున్నవి. ఈ సంఘమునుగూర్చి తెలిసికొన గోరువారందఱు దీనినిఁ జదివితీరవలయును. ఈవిషయముల వ్రాయుచు నీమె మనహిందూమతమునందలి యాచారములను, ఉపదేశములను జర్చించుచు వానిని సకారణముగనిర్ధారణ చేయుచు హిందూమతమునకు మహోపకారమును గావించినది. 'అవతారములు', 'సనాతనధర్మములు' మొదలగు నీమత విషయములు సులభముగఁ దెలియునటుల సకారణముగను యుక్తియుక్తముగను వ్రాయఁబడియున్నవి. 'మహాయుద్ధము యొక్క

చరిత్ర' యను పేరుతో శ్రీమహాభారతమునందలి కథను, "అనుసరణపాత్రుఁడగు రాజు," అను పేరుతో శ్రీరామచంద్రుని చరిత్రమును ఈమె మృదుమధురశైలిని రచించి యీ గ్రంథములలో విశేషాంశములను, నందలి కథానాయకుల గుణాధిక్యమును,నయ్యావిబోధించునీతులను,సరసవచనములతోఁ జదువరులకుఁ దేటతెల్లము సేయుచుఁ బూర్వపుభరతఖండపు నాయకుల మహిమోన్నతమును సర్వదేశస్థులును గీర్తించునట్లు పాత్రీభూతముగ నొనర్చెను. ఇంతియగాక హిందూమతాధిక్య సూచకమగు శ్రీభగవద్గీతను ఆంగ్లేయభాషకు భాషాంతరీకరణ మొనర్చి తద్బోధకములగు పరమార్థవిషయముల నాభాషావిదులకుఁ గరతలామలకముగఁ జేసినది.

అయిదవ ప్రకరణము.

ఇఁక నీమెకును మన హిందూదేశమునకును గల సంబంధమును దెలిసికొందము. ఈమెకుఁగల హిందూదేశాభిమానమును, నాయభిమానమునకు కారణములను సదివఱకేసూచింపఁబడెను గదా? ఈ యమ హిందూదేశము నుద్ధరించుటకై చేసిన సేవలలో నగ్రగణ్యమైనది జాతీయవిద్యను నెలకొల్పుటకై చేసిన పరిశ్రమము ఆంగ్లేయప్రభుత్వమువలనను, దానిమూలమున నింగ్లీషువిద్యకే ప్రాముఖ్యముసంభవించి, పాశ్చాత్యదేశములయందలి యైహికసంబంధమైన యూహలకుఁ బ్రచారము కలిగెను. ఆపై బ్రహ్మసమాజమువారిచే జనించిన పాశ్చాత్యనాగరికతావ్యామోహము ప్రబలినది. దీనిచే మనయాచారములకును, నాగరికతకును, సాంప్రదాయములకును కీడుసంభవించి,

రానురాను మనము క్షీణదశఁ జెందినాము. నవీన భరతఖండము నాగరికదేశమనియు, భారతీయు లనాగరికులనియు ననునుద్దేశములు జనించెను. భారతీయులు నిష్కారణములగు మూఢనమ్మకమునఁ గలవరపడువారలనియు, ననవసరములగు నాచారసంప్రదాయముల నిర్మించిరనియు, నంధపరంపరాన్యాయమున నిప్పటివార లున్నారనియు, ప్రకృతకాలమున నుపయోగపడఁగల గ్రంథములు భారతీయుల దేశభాషలలో లేనేలేవనియు, నాంగ్లభాషాభ్యసనమే ఇహపరసాధనమనియు దృఢాభిప్రాయముతో నుండిరి. అట్టిస్థితిలో నీమె వ్రాతలు, నుపన్యాసములును, జాతీయతకు బీజములై యందఱి మనస్సులయందును బాగుగ నాటినవి. మన ప్రాచీన గ్రంథముల నంతచులకనగాఁ జూడరాదనియు, నందలి గొప్పయంశములు మఱేవాఙ్మయమున లేవనియు, నన్నిభాషలలో సంస్కృతమే గొప్పదనియు, నీయమ వాదించుచుండెను. నశించుచున్న భారతీయకళలను, పరిశ్రమములను మరల నుద్ధరించుటకు మొదలిడెను. ఇందుచే దేశమున నిజమైన జాతీయతయేర్పడెను. జాతీయోద్బోధన చేయుటయేగాక యింకను దేశాభివృద్ధికరములగు గొప్పకార్యము లాయమ కావించెను.

ఈయమ వాక్పాటవము.

ఆయమపూనుకొనిన మహాకార్యనిర్వహణమునకుఁ దోడ్పడిన యుపకరణములలో, నామె వాక్పటిమ ముఖ్యమైనది. ఆంగ్లేయభాషోపన్యాసకులలో నసాధారణలని యనిపించుకొనినవారిలో నీమె యొకతెయైయున్నది. ఈమె యుపన్యాసవిన్యాసము కావించుచుండఁగా కర్ణోత్సవముగ నుండును. ఈమె

రెంతయుత్సాహముతో నేవిషయమునుగూర్చి చెప్పుచుండునో వినువారలును నావిషయమునుగూర్చి యంత యుత్సాహమును బొందుదురు. తనవాక్సామర్థ్యమునఁ దాఁజెప్పు ప్రతివిషయ మునందు నీమె జనులకు నమ్మకమును బుట్టింపఁగలదు. ఈమె కంఠధ్వని విరళమై గంభీరమై తనయవ్యక్తమధురిమచే జనుల హృదయముల నాకర్షించుచుండును. ఈమె మాటాడఁదలఁచు కొన్న విషయములన్నియుఁ గారణకార్యసమన్వితములుగ నొక దానివెనుక నొకటి తమంతన యుచితశబ్దస్వరూపమున వెలు వడుచుండునట్లుండును. ఇట్లని చెప్పుటచే నామెయుపన్యా సము కావించుట కేమియు శ్రమపడవలసినది లేదని చెప్పుట కాదు. ఈమె ఏవిషయమును జెప్పఁదలఁచుకొన్న నావిషయ మును గూర్చి వ్రాయఁబడిన పుస్తకములన్నియుఁ జదివిననే కాని యుపన్యసింప నారంభింపదు. ఈమె యుపన్యసించురీతిఁ జూడ నీమెకష్టపడనందనె విషయములన్నియుఁదమంతఁదామే యప్రయత్నకముగ వచ్చుచున్నట్లు దోఁచును. ఎంతటిగొప్ప జనసంఘమునకైన దినమునకు నాలేసి యుపన్యాసముల నిచ్చు టకు నీమెశక్తికలదు. స్వభావప్రేరితమున లభ్యమైన నీమహా సాధనమున నామె జనుల యోగక్షేమమునకు నుపయోగించుచు సద్వినియోగము చేయుచుండుట యెంతయుఁ గీర్తనీయము.

ఈమె మతసంఘమున కధ్యక్షత వహించుట.

బ్లావెట్స్కీదొరసాని పరమపదము నందినది మొదలు కొని 1907 వ సంవత్సరమువఱకు కర్నల్ ఆల్కాటుదొర యీసంఘమున కధ్యక్షతవహించియుండెను. అతని యనంతర

ము బెసెంటుదొరసాని యీయధికారభారమును నిర్వహింపఁ బూనుకొన్నది. అప్పటినుండియు నీమె దేశదేశముల సంచరించుచు నాయా యెడలఁ దను బ్రహ్మజ్ఞానసభాశాఖల నుద్ధరించుచు, నవీనశాఖలఁ బానుకొల్పుచు, నీమతసంఘమును జాల యభివృద్ధిలోనికిఁ దెచ్చి తన ధర్మములను యథావిధిగ నిర్వహించుచుండెను. ఆయా కార్యముల నిర్వహింపఁగలవారినే యేర్చి నియమించుటలో నీమె చాలనిపుణురాలు. ఈ కార్యముల విషయమై జరగు నుత్తర ప్రత్యుత్తరముల నీయమ స్వయముగఁ దనచేతి మీఁదుగనే నడపునుగాని యొపనికై యొరుల నియమింపదు.

ఈమె పరమాత్మజ్ఞానబోధక సంఘమువారిలోఁ జేరిన పిదప హిందూదేశమునకు వచ్చి దేశాభివృద్ధికరములగు కొన్ని ఘనకార్యము లొనర్చినది.

హిందూసర్వకళాశాల.

కాశీనగరమున నామె స్థాపించిన హిందూకళాశాల* వానిలో మొదట గమనింపవలసిన దైయున్నది. జాతీయాభివృద్ధికి మూల మైనది విద్య గావున దానిని యథావిధిగఁ గఱపు మనదేశములో మంచిపాఠశాలలు లేవని యామె మనదేశపు మహారాజులకును ఇతరదేశములలోని యౌదార్యబుద్ధి గల ధనికులకును దన యుద్యమమును దెలిపి ద్రవ్యము సంపాదించి పురాతనమునుండియుఁ గళలకు నెలవును బుణ్యస్థలమును

* ఈ కళాశాల హిందూ యూనివర్సిటీగ మాఱి శ్రీపండిత మాళవ్యాగారి యాజమాన్యమున వృద్ధిచెందుచున్నది.

నైన కాశీపురమున నొక గొప్పకళాశాలను నిర్మించినది. ఈ కళాశాలయే హిందూ యూనివర్సిటీవారి స్వాధీనమైనది. అందుఁ బెండ్లికానివారుమాత్రమే విద్యార్థులుగఁ జేర్చుకొనఁ బడుదురు. సంస్కృతమును గాని యాంగ్లేయభాషనుగాని ప్రతివిద్యార్థియును బ్రధానభాషగఁ దీసికొని మిగిలినదానిని గూడఁ గొంతవఱకుఁ జదువుచుండవలయును. అందు నక్షరాభ్యాసము మొదలు శాస్త్రపరీక్ష వఱకును జదువుకొనవచ్చును. అందఱి విద్యార్థుల భోజనాదులనిమిత్తమై మంచి యేర్పాటులు చేయఁబడి యున్నవి. దేశాభివృద్ధికి బాలురు శాస్త్రాభ్యాసము చేసి బుద్ధిబలమును బొందుట యెంత యావశ్యకమో వారు దేహవ్యాయామమునుజేసి దేహబలమును గూడఁ బడయుట యంత ముఖ్యమని యెంచి యీమె విద్యార్థులందఱును వారివారివయస్సునకుఁ దగిన శరీరవ్యాయామమును దీసికొను నట్లు కట్టడి చేసెను. మనయాంగ్లేయ పాఠశాలలయందు మత విషయములఁగూర్చి యేవిధమైన శ్రద్ధ తీసికొనక పోవుటవలన విద్యార్థులు మతాభిప్రాయములఁ గూర్చి జ్ఞానశూన్యు లగుటఁ గాంచి యీమె యాకళాశాలలోఁ బ్రతిదినమును బాఠములఁ జెప్పుటకు ముందు హిందూమతబోధకములగు పుస్తకములఁ గొంచెముకాలము పఠించిననేగాని పాఠశాల కార్యముల నిర్వర్తింపఁగూడ దని యేర్పాటుగావించి యుండెను. ఆ యూశాస్త్రములలోఁ బ్రజ్ఞానిధు లైనవారిని గొనివచ్చి యీమె యీ కళాశాలలో నుపాధ్యాయులపదవిని నిల్పినది.

ఈకళాశాలపేరిట నొక మాసపత్రిక వెలువడుచుండును. అందుశాస్త్రబోధకములును నీతిబోధకములును నైనవిష

యములు ప్రచురింపఁబడుచుండును. దానిచందాలమూలమున వచ్చిన యాదాయమును కొంతయు విద్యార్థుల వేతనమునకై వినియోగించుచున్నారు.

మనదేశమున కభివృద్ధికరము లయినకొన్ని విధాయక కృత్యముల నీమె మనకు విధించియున్నది.

ఇప్పటికాలపుమనవా రందఱును దమబాలుర కక్షరాభ్యాసము కాఁగానే ఏ. బి. సి. డి. అనే నేర్పుచున్నారు. తన్మూలమున బాలురకు స్వభాషయందలి గౌరవము, ప్రీతి, పాండిత్యము పోవుటయేగాక పెద్దలకుసయితము దురవగాహములైన విదేశవిషయములతోఁ గూడినయాంగ్లేయ పాఠపుస్తకములఁ గంఠస్థము సేయుఁ దమ లేఁత మనస్సుల నిర్బంధన సేయుచుఁ దుదకుఁ దద్భాషా ప్రావీణ్యమునుఁ గూడఁ బొందఁ జాలక రెంటికిని జెడినరేవణు లగుచున్నారు. దీనివలనఁ గలుగునర్థమిదియొక్కటియేకాదు. మనపూర్వులగుణాధిక్యమును మహిమోన్నతభావమును వెల్లడిచేయు మనస్వభాషలలోని యుద్గ్రంథములఁ జదువ శక్తులుగాక తమజాతీయమత వేదాంతసిద్ధాంత శాస్త్రవిషయములమహిమఁ దెలియఁజాలక యితరుల మతమునకు నాగరికతాదివిషయములకుఁ జెయిఁ జాచుచున్నారు. దీనివలన నిప్పటివారికి స్వాభిమానము, స్వదేశాభిమానము జాతీయమతాభిమానము నశించుటయేకాక వానియందు నిగర్హణభావ మేర్పడుచున్నది. ఇట్టియుపద్రవకర మైనస్థితిని దొలఁగించి జనులకు స్వాభిమానాదిగుణములఁ గలుగఁ జేయుటకు స్వదేశభాషల నభివృద్ధిపఱుపవలయు నని బెసెంటుదొరసాని నొక్కి వక్కాణించి యున్నది. అందునను ముఖ్యముగ సంస్కృత

భాష భాషల కెల్ల మాతృభాష గావునను మనశాస్త్రమతాది విషయము లెల్ల నందే వ్రాయఁబడి యుండుటచేతను, దాని నప్రధానభాషగాఁ బాఠశాలలయందుంచి, బాలురకుఁగఱపవల యునని యీమె చెప్పియున్నది. కాశీపురమున నీమె సంస్థాపించిన కళాశాలలో నీవిధముగనే విద్య గఱపఁబడుచున్నది.

రెండవది మనపూర్వులమహిమ గుణాధిక్యము నిశ్చల జ్ఞానము శూరత్వము ధర్మగుణము మొదలుగాఁ గలసుగుణ పుంజముల బోధించుమనపూర్వరాజర్షులచరిత్రల బాలురకుఁ గఱపవలయును. దీనిచే వారలకు స్వదేశాభిమానము, ఆత్మగౌరవము సన్మార్గత మున్నగుమంచిగుణము లలవడుటయేగాక యాత్మదేశగౌరవార్థమై తమప్రాణధనములఁ ద్యజింప లెక్కగొననిధైర్యశౌర్యములుకూడఁ బట్టుపడును.

ఆంగ్లేయపాఠశాలలోఁ జదువుకొనువిద్యార్థు లందఱు నన్యదేశీయము లయినవస్త్రుల(పంట్లాములు,టోపీలు,బూట్సులు మున్నగునవి) ధరించుచుఁ దమ వేషములయందు విదేశీయుల ననుకరించుచున్నారు. దీనివలన రెండువిధములయిన చెఱుపులు కలుగుచున్నవి. మొదటిది యత్యంతశీతలప్రదేశములలో వాడుకొనవలసినయుడుపుల మిక్కిలి యుష్ణప్రదేశములయందు ధరించుటవలన శరీరమునకు గలుగు చెఱుపులు. రెండవది అన్యదేశపద్ధతుల నవలంబించుటవలన స్వదేశాభిమానమునకు నాత్మగౌరవమునకుఁ గలిగిననష్టములు.

కావున నీరెండువిధము లయిననష్టములు కలుగకుండునట్టుల మనము మనపూర్వులచే నాచరితము లయినవేషములనే ధరించుచుండవలయును.

ఇంకొకటి మనము వాడుకొను ప్రతివస్తువును సాధ్యమై నంతవఱకు మనదేశమునఁ జేసినదిగా నుండవలయును. విదేశ వుసామానులు కొనుటవలనఁ గలిగెడు ననర్థము లివ్వియును:—

స్వదేశమున నా యావస్తువులఁ జేయు పనివాండ్రకుఁ బని తగ్గిపోయి వేతనములు లేక క్షామదేవతచేఁ బీడింపఁబడు చుండుట.

మనము కొనెడివిదేశవస్తువుల వెలరూపమున మన ధనము విదేశీయులకుఁ బోవుచుండుట.

స్వదేశవస్తువులయందు గౌరవము తగ్గుటచే స్వదేశాభి మానమునకు నాత్మగౌరవమునకుఁ గలిగెడు చెఱుపు.

ఈ త్రివిధములయిన చెఱుపులును గలుగకుండునటుల మనదేశప్రజను లందఱును స్వదేశాభిమానపరులై స్వదేశవస్తు వులనే కొనుచు స్వాభిమాన ముంచుకొనవలయు నని బెసెంటు దొరసాని నొక్కి వక్కాణించి యున్నది.

దేశాభివృద్ధికిఁ బురుషు లెంత యావశ్యకమో స్త్రీలును నంత ముఖ్యము గనుక స్త్రీలు దేశక్షేమకరము లయిన సర్వ విషయములను నేర్చుకొని, తమబాలురకుఁ గఱపవలయును. విద్యాసంపర్కముననే కాని స్త్రీల కట్టిసామర్థ్యము గలుగ నేరదు కనుక స్త్రీవిద్య దేశాభివృద్ధికరము లయినవానిలో మిక్కిలి ముఖ్యమైన దని యీమె యుగ్గడించియున్నది.

ఆరవ ప్రకరణము

కృష్ణమూర్తివ్యాజ్యము.

1910 సం॥న బిసెంటు జిడ్డు కృష్ణమూర్తి నిత్యానందము అను నిద్దరు బ్రాహ్మణపిల్లవాండ్రను తన పోషణలోనికి తెచ్చుకొనెను. వీరితండ్రి కడపజిల్లాలో తహసీల్దారుగానున్న జిడ్డు నారాయణయ్యగారు. వీరుద్యోగమున నున్నపుడే యీపిల్లవాండ్రను బిసంటే పోషించుటకు ప్రారంభించెను. కొన్నికారణాంతములవల్ల రెండుసంవత్సరములకు వీరి వ్యవహారము కోర్టులకు ఎక్కినది. ఈయిబ్బందిలో ఆమెకు పెక్కుచిక్కులు తటస్థించెను. తనవ్యాజ్యమును తానేన్యాయవాదిగ జరపవలసి వచ్చెను. కానిధర్మశాస్త్రములయందును వాదించుటయందును ప్రవీణతకలిగియున్నందునమిక్కిలిసూక్ష్మముగ తనవ్యాజ్యమును నడపెను. న్యాయస్థానమున ప్రతికూలమైనను ధైర్యమువదలక సీమకు అపీలుతీసికొని వెళ్లి తుదకు తనవ్యాజ్యమున జయము నొందెను. ఈవ్యాజ్యము 1914 సం॥న తీర్మానమాయెను. ఇంతదనుక మరేవిషయమువప్రవర్తింపక తాను మొదలిడిన కార్యమును జయప్రదముగ పూర్తిచేసికొనెను. కాని బీసెంటు, జిడ్డు నారాయణయ్య, బి.ఏ;వంటి విద్యాధికులును లౌకికులును ఇట్టి అనవసరమైన పని నెత్తిపై తెచ్చిపెట్టుకొని తాము కష్టములకుపాలై యితరులకుకూడ కష్టముకలిగినందులకు కారణములు తెలిసినవికావు.

1918–సం॥న ఒక వారపత్రిక మొదలుపెట్ట నిశ్చయించి సమయమునకై కాచియుండెను. ఈవిషయమై పట్టుదలతో

పనిచేసి 'కామన్‌వీల్' అను వారపత్రికను ప్రారంభించెను. ఇందు ముఖ్యముగ ఆంగ్లహిందూదేశములకుగల సంబంధబాంధవ్యములగూర్చినవిషయచర్చయే మెండుగనుండును. మన ఆశయములను ఆంగ్లేయులకు తెలియచెప్పి ఉభయులకు మైత్రిని వృద్ధిచేయుటయే ఈపత్రిక ముఖ్యోద్దేశము. తాను గోచరింపఁజేయుచున్న ఆదర్శములయందు స్వరాజ్యసంపాదనమే ముఖ్యాదర్శమని వెల్లడిచేసి యుండెను ఇండియాకు కనడా, ఆస్ట్రేలియా మొదలగుచోట్లలో స్థాపింపఁబడినస్వాతంత్ర్యరాజ్యస్థాపనమే మనదేశౌన్నత్యమునకు నాగరికతకు ఆవశ్యకమని యుద్ఘాటించుచుండెను. కామనువీల్ పత్రికను స్థాపించిన కొలది కాలమునకే 'స్టాండర్డు' పత్రికనుకొని సంపాదకురాలుగ 1914 సం||న "న్యూఇండియా" పత్రికను స్థాపించెను. హిందువుల ఆదర్శములు ఆశయములను తెలియఁజెప్పి పెంపొందించుటకును, వారికష్టముల బయల్పెట్టఁబూని పోగొట్టుటకును స్వరాజ్యసంపాదనమునకై పత్రికాముఖమున కావలసిన పనులఁజేయుటకును న్యూఇండియాపత్రికాధిపురాలనైతి నని ఆమె తనముఖ్యోద్దేశమును వెల్లడిపరచెను.

దేశీయమహాసభచే కోరఁబడినస్వరాజ్యసంపాదనమేత్వరలో సిద్ధించుటకు తనపత్రికతోడ్పడునని కూడా ప్రకటించెనుగదా. జాతిమతభేదముల పోఁగొట్టుటకును పూనికతో పైఆదర్శనమునకై పాటుపడుటకును మొదలుపెట్టెను. స్వరాజ్యమునకుచేయు కృషి ప్రకృతిధర్మమనియు దానిపడయుటకు కొంత ఆందోళనమవసరమనియు ఆందోళనమునకు కాలము తటస్థించినదనియు భావించి ఈవిషయమై దృఢప్రయత్నములు ప్రారంభించెను.

ఈవిషయము జనులమనస్సులనాటునట్లు కరపత్రములు ఎన్ని యో ప్రకటించుటకు ప్రారంభించెను. ఎన్నియోచోట్లకు వెళ్లి వివిధవిషయములఁగూర్చి అనేకోపన్యాసములఁ ఇచ్చెను. దీనివిపులముగ చర్చించి దేశమున ఐకమత్యము పురికొల్పుట ముఖ్యోద్దేశ మని న్యూఇండియాద్వారా ప్రకటించెను.

స్వరాజ్యము.

స్వరాజ్యము (స్వపరిపాలన) అనుమాట క్రొత్తదికాదు. దేశీయసభ స్థాపించినదిమొదలు మన మీమాటను వినుచున్నాము. కాని దీనిసంపాదించుటకై కొంతపట్టుదలతో ఈమెపని చేయుటకు ప్రారంభించెను. మనకృషి తెలియుటకై 'ఇండియా స్వరాజ్యమునకై ఎట్లుపాటుపడెను' అను ఒక గ్రంథమును, 'ఇండియా ఒకజాతి' అను మఱొక గ్రంథమును ప్రకటించెను. దీనికి దేశమున హెచ్చువ్యాప్తి కలిగినందున అందలివిషయము లందఱిమనస్సులకు బాగుగనాటెను. 1915 సం॥న బొంబాయి దేశీయసభకు ఆమెవెళ్లి స్వరాజ్యతీర్మానమునుగూర్చి చక్కఁగ నుపన్యసించెను. దేశీయసభయుద్దేశములకు విరోధములేనట్టు హోంరూలుసభను స్థాపించెను. 1916-వ సం॥న బొంబాయి నుండి చెన్నపురికిరాగానే హోంరూలు ఆందోళనము ప్రారంభించెను. ఈ సభ మిక్కిలి పట్టుదలతో ప్రారంభించినందుచే ఈ సభకు గౌరవమును పలుకుబడియురాసాగెను. ప్రతివారికిని ఈసభచేయుపని ఆశ్చర్యముకలిగించెను. అధికారులకుకూడ ఈ సభ చెప్పునంశముల కొంత ఆలోచింపవలసివచ్చెను. దేశీయ మహాసభయందు స్వరాజ్యతీర్మానముపై యుద్రేకమగు యుపన్యాసముల నిచ్చెను. ఇంతవరకును 'న్యూ ఇండియా' ఏకష్టము

లేకనే సాగుచుండెను. 1916 సం॥ మే 26 తేదీని రెండు వేల రూపాయలు ధరావత్తుకట్టవలెనని సర్కారువారు కోరిరి. ఇట్లుకోరుటకు కారణము చెప్పినారుకారు. ఈతీరున పత్రిక లో వ్రాయఁబడెను. "కారణముచెప్పలేను. మావ్యవహారముల సమాప్తిచేయుటకు యత్నముజరగుచున్నది. మాతప్పుదిద్దుకొనుటకు అవకాశముకనఁబడదు. ఏలన, తప్పిదియని తెలుపలేను. నేనుకోరినధరావత్తునిచ్చి తప్పు తెలియక మరలవారు కోరినచో పదివేలు ధరావత్తు చెల్లించవలసియుండును. ప్రభుత్వమువారి ధర్మమీలాగున చెన్నపురియందు పరిణమించుచున్నది." ఇట్టి ఉత్తరవుకష్టముగా కనిపించినను. తరువాత మనమంచికే అని తోఁచెను. దేశమంతటను ఈయుత్తరువు అన్యాయమని తీర్మానములు కాఁబడెను.

న్యూయిండియా ఉద్ధరణమునకై అన్నిచోట్లనుండి ద్రవ్యసహాయమురాసాగెను. ఈవిషయమై చెన్నపురి హైకోర్టునకు అపీలుచేయఁబడెను. అపీలుతానేవాదించుకొనెనుగాని ప్రతికూలముగ తీర్మానింపఁబడెను. వార్తాపత్రికలసంఘము బొంబాయిలో సభకావించి వార్తాపత్రికలశాసనమును ఖండించుచు శాసనము రద్దుకావలెనని కోరిరి. ఈవిషయమై రాజప్రతినిధికి మనవిచేయుటకై ఒకసంఘమేర్పడి రాజప్రతినిధికి వారి అభిప్రాయములు తెలియఁజెప్పిరి కానివారు తగినసమాధానము ఇచ్చినారుకారు.

బొంబాయి గవర్నమెంటు ఉత్తరువు.

హైదరావత్తు ఇచ్చినవెనుక ఈమెబొంబాయిరాజధానికి రాఁగూడదని ఆర్డరుపుట్టెను. తానుఈయుత్తరువును ఉల్లం

ఘించననియు తన్ను అణగఁగొట్ట వలయునని చేయుప్రయత్నము లన్నియు ఇట్టిప్రజాపీడనమునుండి తప్పించుకొను నిశ్చయమును దేశమంతట పురికొల్పుచున్నదనియు పత్రికలో వ్రాసెను. ఇది యిట్లుండ 1916 సం॥ సెప్టెంబరులో నాగపూరుప్రభుత్వమువారు తమరాజధానికి రాఁగూడదనిరి. అప్పుడు అచ్చటికితాను దివ్యజ్ఞానసభ కగ్రాసనాధిపతిగ వెళ్లదలఁచినట్లును రాజకీయవ్యవహారములకు కాదనియు అధికారులకు తెలియఁజేసెను. ఈవిషయమై పత్రికలు సభలు అసమ్మతిని వెలిపుచ్చిరి. ఈకష్టములేవియు ఆమెకృషికి ఇబ్బందికలిగించినవికావు. న్యాయమని ఆమెభావించిన యుద్యమముల కీయుత్తరువులు ఆటంకముకలిగించలేదు.

దేశీయమహాసభకు వెళ్లుట.

ఈఘోరయుద్ధమున హిందువులు మహమ్మదీయులు చేసిన యపారసహాయములు ఆంగ్లేయుల దృక్పథమును కొంత మార్చివైచెను. వారి వార్తాపత్రికలేమి రాజనీతిజ్ఞులు లేమి మనదేశస్థితిని మనస్సునకు తెచ్చుకొని అభిప్రాయముల మార్చుకొని సామ్రాజ్యమునందు ఇండియా సమానస్థానమును వహించవలెనని చెప్పుచుండిరి; కాని యుద్ధానంతర రాజకీయసంస్కరణల నాలోచింపుచు ఇండియా సంస్కరణలఁ గూర్చి ఆంగ్లేయులు ఆలోచించునట్లు ఒకకాలమున కనిపించనందున ఈసమయముతప్పిన సమయము మరల రాదనియెంచి తమహక్కులఁ గూర్చి కొంత ఆందోళనము గావించినఁగాని యివియివ్వరని మనవారికి చెప్పి ఏకదీక్షతో ఆందోళనమార్గము మనవారికి నేర్పమొదలిడెను. తనవాక్చాతుర్యమగు నుపన్యాసములలోనేమి వార్తా

పత్రికలలోని వ్యాసములలోనేమి తనగ్రంథములవలననేమి వివిధకరపత్రములతోనేమి హిందూదేశమునందంతటను స్వారాజ్యసంపాదనమునకై ఆందోళనమును నెలకొల్పెను. దేశీయుల మనోనిశ్చయమును ప్రభుత్వమువారి యన్యాయపుటుత్తరువులు బలపరచుచుండెను. ముప్పదిసంవత్సరములుగా మనవారు చేయుచున్న పనిని అతిశీఘ్రకాలమున ఈమె వృద్ధిచేయఁగలిగెను. అఖిలభారతీయమహాదేశీయసభకు పోవుటకు ప్రారంభించెను.

1916 సం॥న లక్నోలో జరిగిన దేశీయమహాసభకును, ముస్లిమ్ మహాసభకును ఈమె వెళ్లెను. దేశీయమహాసభలో స్వారాజ్యతీర్మానమునుగూర్చి మరలచక్కఁగ నుపన్యసించి ఈక్రింది విధముగ తనయుపన్యాసమును పూర్తికావించెను. "హిందూదేశ మింకను ఇంగ్లాండును ప్రేమించుచున్నది. ఇండియా ఇంగ్లాండుతో సంబంధమును వదలుకొనుటకు ఇచ్ఛగింపదు. ఇండియాను ప్రేమించు ఇంగ్లాండు పత్రికాశాసనము, ఇండియారక్షణశాసనము మొదలగు భయంకరములగు ఇనుపశాసనములచే కట్టఁబడియున్న ఇంగ్లాండు కాదు. అట్టి ఘోరశాసనములుగల ఇంగ్లాండును మేము ప్రేమించుబలేము. క్రాంవెల్, పిం, హామ్‌ప్డన్, మిల్, షెల్లిగారి ఇంగ్లాండును ప్రేమించుచున్నాము. అన్యాయముగ ఇటలీనుండి వెళ్లగొట్టఁబడిన మ్యాజినీమహాత్ముని రక్షించినట్టియు, ఇటలీదేశవిమోచనమునకు కారణభూతుఁడైన గారిబాల్డినిఆహ్వానించినట్టియు, రాజకీయాందోళనమునపాల్గొన్న ఎట్టివారినైనను రక్షించిన ఇంగ్లాండును మేము ప్రేమించుచున్నాము. ఎన్నికష్టములు వచ్చినను మేమనుకొనిన ఇంగ్లాండిదియే. ఇంగ్లాండుదేశీయు లిపుడు తమ

స్వలాభము నేచూచుకొను ఆంగ్లో ఇండియనులమాటలచే జనించిన అంధకారమున కనులుమూసికొనియున్నారు. అట్టినిరంకుశాధికారులు కావించినతప్పుల నే స్థిరపఱచుచున్నారు. ఇంగ్లాండు తనజీవితమునకై ఈఘోరయుద్ధము సల్పుచున్నది. హిందూదేశమును సహాయము కోరినది. కోరినదానికన్న పదిరెట్లు ఎక్కువగ ఇండియా సహాయముచేసి యుండెడిది; కాని, తన కష్టదశలో హిందువులను బెల్జియస్వాతంత్ర్యమును కాపాడుటకు పిలుచుచున్నది. హిందువులు బెల్జియము స్వాతంత్ర్యమునకై పోరాడివచ్చి మరలపారతంత్ర్యమున బాధపడవలసియున్నది. వాగ్దానములన్నియు నిర్లక్ష్యపెట్టఁబడినవి. ఐరోపాలో ఇంగ్లాండెందునకు పోరాడుచున్నదో దానినే హిందూదేశమునకుకూడ అన్వయించునట్లు చేయవలెను. ఏక్షణము స్వాతంత్ర్యమును మనమాశింతుమో అప్పుడే అర్హులమగుచున్నాము. ఇంగ్లాండుస్వాతంత్ర్యము నివ్వదు. ఇదివరలో ఎవరికిని ఇచ్చియుండ లేదు. మీరుస్వాతంత్ర్యము కావలయునని కోరినపుడు, స్వాతంత్ర్యనిశ్చయము చేసికొనినపుడు మాటలు చెప్పుకాలముదాటినపుడు ఇంగ్లాండు తప్పక స్వరాజ్యమును ప్రసాదించును. అట్టిస్వాతంత్ర్యము ఇండియాకిచ్చువరకు దేశాభ్యుదయమునకు ఎడముండదు.” ఈయుపన్యాసమిచ్చిన తర్వాత ఎడతెగని శక్త్యుత్సాహములతో కార్యక్రమమునకు దిగి అనేకోపన్యాసముల నిచ్చియు గ్రంథములు వ్రాసియు ఆందోళనమును జరపినది. ఈతీరున నిర్భయముగను, హిందువులు తలచనట్లుగను, అధికారులచర్యల మర్శించుచు వారితప్పుల బయలుపరచుచు ప్రజల కుత్సాహము కల్పించు

చున్నందున మదరాసు ప్రభుత్వమువారికి భయముపుట్టినది. ఈమె ప్రచారమునకు ఆటంకముకల్పించవలెనని ప్రభుత్వము వారనుకొన్నట్లు వదంతిపుట్టెను. 1917 సం॥ మే నెల తే 24 దీని శాసనసభలో గావించిన అంత్యోపన్యాసమునకు ఆశ్చర్యము చెందని హిందువులు లేరు. ఈమాటలు బిసెంటుగారి ఆందోళనమును ఉద్దేశించి చెప్పఁబడినదని అందరికిని తెలియవచ్చినది. ప్రజలు బాధ్యతాయుత ప్రభుత్వమును ఇవ్వమని కోరఁగూడదని చెప్పిరి. ఆందోళనము మాననిచో దాని నణఁచుటకు అవసరమగు పద్ధతుల నవలంబింతుమని భయపెట్టిరి. కాని, బిసెంటు ఇట్టిబెదరింపుల లక్ష్యపెట్టునది కాదు. ఈ యుపన్యాసమును చదివిన తత్క్షణమే తన అభిప్రాయమును వెల్లడి పఱచుచు ఉపన్యాసములోని లోపముల బయల్పరచి బెదరింపులకు లొంగువా రెవ్వరును లేరని చెప్పెను. శాసనసమ్మతమైన ఆందోళనము నణఁచుటకు ప్రయత్నించుట నిష్ప్రయోజన మని తెలియఁ జెప్పెను. ఏమి శిక్షవిధించినను అవసరమైనట్టి శాసనబద్ధమైన సక్రమాందోళనమును వదలఁగూడదనియు, గవర్నరుగారి యుపన్యాసమును తీవ్రముగ ఖండించవలెననియు దేశీయులను, స్వరాజ్యవాదులను ఈమె పనులకు పురికొల్పెను. ఈవిషయమై దేశమందంతటను సభలుగావింపఁబడి నాయకులు వారి యభిప్రాయముల వెల్లడించిరి.

ఇది యిట్లుండ రాజ్యాంగవాతావరణమున చలనమేర్పడినట్లు తెలియవచ్చెను. స్వామిభక్తిపరాయణులైన ప్రజాసంరక్షణార్థమై నిరోధక మార్గముల నవలంబించుట అవసరమైనపని యని సర్కారువారీ క్రిందివిషయము ప్రచురించిరి.

పెట్లండు ప్రభువుగారి యుపన్యాసము:—1917-వ సం॥ జూన్ తే 15 ది. "ప్రస్తుతము జరగుచున్న రాజకీయ వాదములఁగూర్చి ప్రభుత్వమువారి యభిప్రాయమును తెలియ పరచవలసిన దని యెల్లరును కోరుచున్నారు. ఈవిషయమై ఆందోళనము సలుపుసంఘముల అభిప్రాయముల గూర్చియు, సలహాలనిచ్చు విధానముల గూర్చియు ఎల్లరకును తమ స్థితిని వెల్లడిచేయుటయే ప్రభుత్వమువారి ముఖ్యాభిప్రాయమైయున్నది. దేశపరిపాలనమున తాము పాల్గొనవలె ననెడి భారతీయుల స్వాభావికాశయములయెడల ప్రభుత్వమువారు క్రియారూపక సానుభూతిని కలిగియున్నారనుటకు అనేక నిదర్శనములు కలవు. మఱియు బ్రిటిష్ సామ్రాజ్యమునందుండి స్వరాజ్యమునుపొందవలెననెడి యాశయమునకు ఇందుల కై యే యున్యాయ సమ్మతమైన ప్రయత్నములకు ప్రభుత్వమువారు విముఖులుగారు. విద్యాభివృద్ధిఁజెంది దేశమున ఐకమత్యము పెంపొందిన కాలఁదియు కాలక్రమమున బాధ్యత గల స్వరాజ్యమును పడయుటకు భారతీయులెట్టి అభ్యంతరమును లేనివారయ్యు, స్థితిగతుల నాలోచింపక యుద్ధానంతరముననే సంపూర్ణ స్వరాజ్యమును ప్రసాదించుటకు ప్రభుత్వమువారు విముఖులని తెలియవలెను. స్వరాజ్యములభించుటకుపూర్వ ముండవలసిన యంతరువులగూర్చియు అందుల కగు కాలపరిమితినిగూర్చియు స్వరాజ్యాశయముల వివరమును గూర్చియు భిన్నాభిప్రాయము లుండవచ్చును. ఇట్టభేదాభిప్రాయముల విమర్శించుటకు మదరాస్ ప్రభుత్వము వారు పూనుకొనలేదు. రాజ్యవ్యవస్థల మార్పుఁ గోరువారు చేసెడి యుద్యమములను వానిఫలితములను

గూర్చి ప్రభుత్వమువారిప్పుడు గమనింపవలసియున్నది. కొంద ఱువక్తలును, గ్రంథకర్తలును, పత్రికాసంపాదకులును ప్రస్తుత రాజ్యపరిపాలనను ఖండించుచు దేశములోని కష్టములు పోవుటకు అములులోనున్న పరిపాలనావిధాన మంతరించవలె నని అమాయకులగు ప్రజల కుద్బోధించుచు అధికారవర్గముపై అవినీతికరములగు నిందారోపణల చేయుచున్నారు. ఇట్టివారు అనుభవజ్ఞానశూన్యులగు కొందఱు యువజనులను రాజకీ యాందోళనమున పాల్గొనుఁడని ప్రేరేపించుచు వారిమనస్సు లకు అపాయకరమైన మార్గములకు లాగుచున్నారు. మార్పు లను కోరునపుడు నిగూఢమగు బెదరింపులును, బహిరంగమైన ప్రభుతిరస్కారమునువీరిచే ప్రయోగింపఁబడుచున్నవి. ఇందుచే ప్రభుత్వమువారి అధికారమును ధిక్కరించు ప్రయత్నములు జరుగుట తటస్థించుచున్నది. ఇట్టి ప్రయత్నములు దేశములోని నెమ్మదికిని దేశాభివృద్ధికి భంగకరముగ పరిణమించుటయు అందుచే యుద్ధవిషయమున సర్వశక్తుల కేంద్రీకరించుటకు వీలుకలుగక పోవుటయుసంభవించును. అందుమూలమునస్వరా జ్యోద్యమనాయకులయందు ప్రజలకు నమ్మకము తగ్గును. ఈ ప్రయత్నములవల్ల తప్పక కలుగుఫలితములఁజూచి, ఈప్రయ త్నములు మానుదురని తలఁచి ప్రభుత్వమువారు మిక్కిలి సహ నముతోనూరకుండిరి; కాని యిప్పుడు వారు విధ్యుక్తధర్మమును నిర్వహింపవలసియున్నారు. కావున రాజభక్తిగల ఈరాష్ట్ర వాసుల ఆశయములకు భిన్నముగ పట్టుదలతో పనిచేయువారి చర్యలను నిశ్చలచిత్తముతో ప్రభుత్వమువారు తిలకింపఁ జాలరు."

దీని చదివినవా రందఱికిని నిరోధకమార్గావలంబనమునకు కారణములేదని స్ఫురించగలదు. సక్రమస్వరాజ్యాందోళనమును నిషేధించుటకై ప్రయత్నముల మొదలిడుచున్నా రనునదంతయు వినవచ్చెను. ఇదియంతయు నొకవంకజరగుచుండ గవర్నరుగారు బిసెంటుతో ప్రసంగించుటకై నీలగిరికి రావలయునని కోరియుండి, కారణాంతరములచే తామే చెన్నపురికి జూన్ తే 16 దీ వచ్చి ఈమె రాజకీయాందోళనమును మానవలెనని ప్రసంగించి యుండిరి. ఈసంభాషణ చమత్కారమైనది కావున క్రింద పొందుపరచినాను.

శ్రీ పెంట్లండు-బిసెంటుగార్ల సంవాదము.

1917 సంవత్సరము, జూను తే 16 దీని మదరాసు గవర్నరుగారికిని నాకు (బిసెంటునకును) ఇట్టిసంభాషణ జరిగినది:—

గవర్నరుగారు:— మీతో స్వయముగ మాటలాడి మీకు ఆలోచించుకొనుట కవకాశ మిచ్చుటకును నేను ఉదకమండలమునుండి యిచ్చటకు వచ్చినాను.

నేను:— నేను దేనినిగుఱించి యోజింపవలెను?

గ:— అది మీరే నిశ్చయించుకొనవలెను. ఆలోచించుకొనుటకు రేపటివఱకును కాలపరిమితి నిమ్మని నన్నడుగవచ్చును. మీస్నేహితుల సలహాను తీసికొనవచ్చును.

నే:— సర్ ఎస్. సుబ్రహ్మణ్య అయ్యరు, సి. పి. రామస్వామి అయ్యరుగార్లతోడను మాత్రమే నేను యోజింపవలసినది. కాని, వారి అభిప్రాయములు నాకు తెలియుటచే, వారితో ఆలోచన సలుపుటవలన లాభమేమియు లేదు.

గ:—మీరీవిషయమై యోచించుటకు వ్యవధి కోరిన యెడల ఇచ్చెదను.

నే:—నన్నే కారణముచే నిర్బంధావాసశిక్షకు పాలు చేయుచున్నారు?

గ:—ఆవిషయమై నేనేమియు చర్చింపజాలను.

నే:—చెప్పుకొను మాటలను వినకపూర్వమే యెవ్వరిని నిర్బంధావాసశిక్షకు పాలుచేయరాదని సామ్రాజ్యసభలో సర రజినాల్డ్ క్రాడక్ గారు నుడివియున్నారు. నాస్నేహితులలో కొందఱికి స్వాతంత్ర్యము లేకయే నిర్బంధ శిక్షపాలు గావలసి వచ్చినది. కావున క్రేడకు గారిమాటలను నేను విశ్వసింపలేను. వారిమాటలు విశ్వసనీయములు కావలె మీరు ప్రత్యక్షముగ జూపినంతను మీకెంతయు నేను కృతజ్ఞురాలను.

గ:—ఆవిషయమై నేనేమియు చర్చింపజాలను.

నే:—నా అంతరాత్మ బోధనలననుసరించి నేను నడచుకొనెదను, అపై దైవాధీనము.

గ:—మనము ప్రకృతము ఆవిషయమునే యోచింపవలయును.

నే:—నేనిదివరకు వ్రాసిన విషయములను గూర్చిగాని, చెప్పినమాటలను గురించిగాని నేను చింతింపవలసిన యవసరము లేదు. నేనేవిషయమును యోచింపవలెనో తమరు సెలవిచ్చిన గాని యేమిచెప్పుటకును నాకు తోచకున్నది.

గ:—ఆవిషయమే మీరే నిశ్చయించుకొనవలెను.

నే:—తమరు నాకు ఇంగ్లాండునకు పోవుట గత్యంతరముగా చూపదలచుకొన్నారని వినుచున్నాను.

గా:—యుద్ధసమయములో మీరు ఇంగ్లాండు సురక్షితముగ పోవుటకు తగిన యేర్పాటులను చేయించెదను.

నే:—నాకు ఇంగ్లాండుకు పోవలెనని యూహ లేదు. తమరొసంగిన యుపన్యాసమును బట్టి చూడగ హోమురూలుతో నభేదమగు దేశీయసభా కార్యక్రమమునకు తాము వ్యతిరేకులని నాకు తోచినది.

గా:—ఆవిషయమై మరల చర్చింపజాలను.

నే:—దేశీయమహాసభా కార్యక్రమములనే హోమురూలు సమితివారు బలపరచుచున్నారు. (అని దేశీయ మహాసభాకార్యక్రమమును శ్రీవారికి చదివి వినిపించితిని.)

గా:—అదేమియో నాకు తెలియదు.

నే:—ఇవి దేశీయమహాసభవా రంగీకరించిన సంస్కరణ తీర్మానము.

గా:—నేను దానిని చూడలేను.

నే:—ఇది భారతదేశీయ మహాసభదియని తమరు చిత్తగించవలెను. (కొంతసేపైనతరువాత నే నీవిధమున మాటలాడితిని.) రాజకీయాందోళనమున పాల్గొనుటకు యువకులను నేను ప్రోత్సాహపరచుచుంటి నని తమరుచేసిన ప్రకటనమున చెప్పియున్నారు. ఈమాట నన్నుగూర్చియే పలుకబడెనని ప్రజలభిప్రాయపడుచున్నారు. కాని యీమాటలు నేను వ్రాసిన విషయములకును వాక్రుచ్చిన ఉపన్యాసములకును విరుద్ధముగనున్నవి.

గా:—ఆ విషయమై నాకేమియు తెలియదు. ఆమాట లెవరి కన్వయించునో వారిని గూర్చియే యవి వ్రాయబడినవి. మీ ప్ర

యత్నములనన్నిటిని మేము ఆపివేసెదమని మీరు గ్రహింప
వలెను.

నే:—నేనును అట్లే జరుగునని తలంచుచున్నాను. ప్రస్తు
తము చెన్నరాష్ట్రము పరిపూర్ణముగ శాంతముగనున్నదనియు,
మీరు చేయదలచుకొన్న కార్యమువలన వంగదేశమునవలె యీ
రాష్ట్రమునగూడ కలవరములు మెండగుననియు నేను ఏలిన
వారికి చెప్పవలసి యున్నది.

గ:—ఆ విషయమై నేను చర్చింపజాలను.

నే:—తమరు నాకుచేయు సలహా లేమియు లేకపోవుట
చేతను, నేను చెప్పుట కేసమాచారములును కూడ కానరాక
పోవుటచేతను, తమ కాలమును వ్యర్థముచేయుచున్నానని నాకు
తోచుచున్నది. అందుచే సెలవుతీసికొన అనుజ్ఞ వేడెదను.

(నేను లేచగ, శ్రీవారునాతో గుమ్మముపరకును వచ్చిరి.)
అప్పుడు శ్రీవారునాతో ఇట్లుచెప్పిరి:—

గ:—మీ ప్రయత్నములలో వేనిని ఆపవలయునో నిరూ
పింపలేము. మీకార్య ప్రణాళిక నంతను నిలిపివేసెదము.

నే:—మీరు సర్వాధికారములు కలవు. నేను నిరాధారు
రాలను. కావున మీయిష్టమువచ్చినట్లు చేయుడు. కాని, ఇండి
యాలోని బ్రిటిషుసామ్రాజ్యమునకు ప్రబలవిఘాతమును
గావించుచున్నారని మాత్రము నేను చెప్పవలసియున్నది. అధి
కారధర్మమునుబట్టి మీరిట్టి ఆజ్ఞ నొసంగితిరి గాన స్వయముగ
మీవిషయమై నాకెట్టి యాక్షేపణమును లేదు.

ఈ సంభాషణ జరుగుటకుపూర్వమే తన్నునిర్బంధపరతు
రనియు తనస్వాతంత్ర్యమునకుఆటంకము కలిగింతురనియు తలచి

యుత్సాహపూరితములగు భావముల వెల్లడిపరచు ఈ క్రింది వాక్యములచే తనఅనుచరులకు ధైర్యముపుట్టించిన న్యూఇండియాలో, ఇది ప్రకటింపబడెను.

భరతఖండమునందలి నాసోదరులకు, సోదరీమణులకు;

దేశీయమహాసభయు, యానద్భారత మహమ్మదీయ సమితియు పాలితస్థితినుండి అధినివేశములతో సమాన భాగస్వామిత్వమును అనుభవించు స్థితికి భరతఖండమును దీసికొనిరావల యునని వెల్లడిచేయున్నవి. శాసననిర్మాణసభలను వృద్ధిచేసి, విశేష ప్రజాసమూహముచే వానిని యెన్నుకొనబడునట్లు చేయవలయుననియు, అట్లెన్నుకొనబడిన ప్రజలు అయిదింట నాలుగువంతులుండవలయుననియు, పన్నులను విధించుశక్తియు, వ్యయమును చేయుశక్తియు నధికారమియుశాసనసభల కుండవలయుననియు, కార్యనిర్వాహక ప్రభుత్వము శాసననిర్మాణ సభలకు లోబడియుండవలయుననియు వారొకరాజ్యాంగ సంస్కరణవిధానమును ప్రకటించిరి. ఈసంస్కరణ విధానమునే మదరాసు గవర్నరుగారి తీవ్రఖండనమునకు పాత్రమయినది దేశీయ నాయకులందరును ఈరాజ్యాంగ సంకల్పమును లక్నోకాంగ్రెసులో నేకగ్రీవముగా నంగీకరించినను పెంట్లండు ప్రభువుగారు లోకజ్ఞానముగల దేశీయు లెవరయినను నిట్టి సంకల్పమునకు తమ యంగీకారము నొసంగిరని వ్రాసిచ్చి యుండిరి. ఈమాటలను పలికిరో లేదో గాని బరోడా, మైసూరు, తిరువాన్కూరులకు దివానుపదవినధిష్ఠించిన వి. పి. మాధవరావుగారు గూడలూరు సభ కగ్రాసనాధిపత్యమును

వహించి ఈరాజ్యాంగ సంస్కరణ విధానము అనావశ్యమ ను ష్ఠేయ మని సెలవిచ్చిరి.

ఈ భేదాభిప్రాయము నటుండ నిండు. హోంమురూలును బలవంతముగా జంపుటకయి చేయదలచిన ప్రయత్నముచాల కఠినమయినది. దేశీయ మహాసభ హోంమురూలు సమితులకును, ఉపసంఘములకును, తదితర సమాజములకును రాజకీయ పరిజ్ఞానమును ప్రజలలో గలుగజేయవలసినదని పెట్టిన పనిని ఈవిధముగా బలాత్కారముగా గవర్నమెంటు వారు జంపివేయ జూచుచున్నారు. కాంగ్రెసు ఆజ్ఞలను పాలింపవలయునా, లేక గవర్నమెంటువారికి లోబడవలయునా అనుగత్యంతర మిప్పుడు మనల నెదుర్కొనుచున్నది. నామట్టుకు నేను దేశీయమహాసభయొక్క ఆజ్ఞలను శిరసావహించెదను. మదరాసు గవర్నరుగారి ఆజ్ఞల నొప్పుకొనను. వారిచర్య శాస్త్ర విరుద్ధమయినది. బ్రిటిషు ఆచారములకును, శాసనములకును ప్రతికూలమయినది. దానికి నైతికానుమతిలేదు. మానవస్వాతంత్ర్య ముఖ్యసూత్రములకు నిర్బంధమును కలిగించుచున్నది. అసహాయులగు ప్రజలమధ్య నిరంకుశ ప్రభుత్వముగా క్రింద నేనీప్రకారముచేయ తీర్మానించుట వెఱ్ఱితనముగా గన్పట్ట వచ్చును. కాని ఇట్టి వెఱ్ఱిపనులవలన స్వజాతులు తమ నిర్బంధములను తొలగించుకొనుటకై యత్నించును. కొంతమంది యిట్లు నేజేయుట సులభమాహాత్మ్యమును సంపాదించుట కని ఎగతాళి చేసిన చేసెదరు గాక!

కాని లోకసేవకు నేను 43 సంవత్సరముల నుండియు నలవాటుపడితిని. నాకు పాతిక సంవత్సరముల ప్రాయమప్పుడు నా

మొదటి క్రైస్తవవేద విరుద్ధ కరపత్రమును బ్రకటించితిని. ఒక్క సంవత్సరములో నాకు విశ్వాసములేని ప్రభుభోజన సంస్కారమునకు రానని నిరాకరించితిని. అంతట నాభర్త నన్ను ఇల్లు వెడలనంపెను. అప్పటికిని ఇప్పటికిని నాభర్తను నేను నిందించను. ఆయనయో క్రైస్తమత ప్రచారకుడు, నేనో భ్రిష్టమతస్థురాలను. ఇట్టి స్త్రీని భర్త ఎటుల నింటియందుంచు కొనును? అతని స్నేహితులును నన్ను తరిమివేయవలసినదనియే బోధించిరి. 1874 వ సం॥ జూలయిలో, 26 వ యేట నేషనలు సెక్యులరు సంఘములో నే జేరితిని. ఆగస్టు 2-వ తేదిని బ్రాడ్లాగారి ఉపన్యాసమును వింటిని. అందులో సాంఘికురా లనుగా జేరి రెండవదినముననో మూడవదినముననో ఆయనతో ప్రసంగించితిని. ఆగష్టు తే30-న దిని నేషనల్ రిఫార్మరు పత్రికలో నా మొదటివ్యాసమును వ్రాసితిని. బ్రాడ్లాగారు మర ణించిన 1891-న సం॥ నకును తప్పక ఆపత్రికకు వ్రాయుచుం టిని. నా దేశహితైక జీవనము నేనొసంగిన మొదటి యుప న్యాసము "స్త్రీల రాజకీయస్థితి", నాటినుండియు అనగా అగస్టు 1874 మొదలు ప్రారంభమయినది. అప్పటినుం డియు నా జీవితమంతయు దేశహితార్థమై ధారవోయబడినది. కాబట్టి నేజేయుచున్న సేవనుండి నన్ను తొలగించుటయే నాకు సంభవింపవలసిన పరమ దురదృష్టము. స్వార్థపరులును, దేశా భిమాన శూన్యులును దీనిని గ్రహింపజాలరుగాని నావలెనే ధర్మానుష్ఠాను లయినవారు దీనిని గ్రహింపగలుగుదురు. సేవా నందమును, కొంతమంది అంతరంగిక స్నేహితుల ప్రేమవలన గలుగు సౌఖ్యమును తప్ప జీవితమునందెట్టి యాకర్షణమును

నాకులేదు. స్వాతంత్ర్యమును పోగొట్టుకొనుటకంటెను, నేను ప్రేమించువారితో సంబంధమును త్రెంచుకొనుటకంటెను, నాకు దుర్మరణము వేఱొకటిలేదు. ఇప్పుడు స్వేచ్ఛను గలిగి, మిత్రులతో నుండదలంచితినేని నే పిరికి పందను, గౌరవహీనురాలను నయ్యెదను. భరతఖండమునకు, సద్ధర్మమున కును ద్రోహినగుదును. అప్పుడట్టి జీవనము నాకు నరకకూప మగును. కాబట్టి ఈపరిస్థితులలో సులభమయిన మార్గము ననుస రించెదను.................................

.... అనిబిసెంటు.

ఆమె యూహించనట్లే జూన్ నెల 16దీని గవర్నరుగారితో ప్రసంగించిన కొంతసేపటికి ఈమెను ఈమె అనుచరులగు అరండేలు, వాడియాగార్లను నిర్బంధప్రవాసశిక్షకు పాత్రులు చేసిరి. సర్కారువారుచేసిన పని దేశమునంతట ఆశ్చర్యమును, విషాదమును, ఆగ్రహమును కల్పించెను.

ఇది కౌలన్యపరిణామని ప్రజలందరు చెప్పుటకు ప్రారం భించిరి. భారతీయులకై పాటుపడుచుండినఈమెను ప్రభుత్వము వారు శిక్షించుటకు కారణము అందరకు తెలిసినదేను. ఈమె కావించిన స్వరాజ్యాందోళనమే ముఖ్యకారణము. ఈమె పద్ధ తులు సక్రమములు కావని చెప్పుటకు వీలుకనబడదు. ప్రభు త్వమువారేకారణము చెప్పలేదు. "ప్రజాక్షేమమునకు ప్రతి కూలమగువిధమున ప్రవర్తించినారనియు, ప్రవర్తింపనున్నా రనియు నమ్ముటకు మాకు కారణములున్నవి," అనిచెప్పిరి. గవర్నరుగారి సంభాషణలో ఏమియు అనలేదు. కాని దేశీయ మహాసభలోని స్పర్థలతీర్చి జాతీయవాదుల అందుచేర్చిన శోక కారణమని ప్రజలూహించిరి. హిందూమహమ్మదీయ సఖ్య

మునకు సన్నివేశము కల్పించినది మరొక కారణము. ఇతరుల వలె మూడునాళ్ళముచ్చటగా ఏపనిచేయక ఎల్లప్పుడు పత్రికల మూలమునను, సభలమూలమునను యుద్ధమసాఫల్యమునకు ప్రజలు పాటుపడునట్లుచేసినది. ఇదియొకదోషము. యుద్ధమునకు సైనికుల పోగు చేయుటకు ప్రయత్నములుచేసెను. స్వరాజ్యాదర్శము ప్రజల కన్నులయెదుట నిరంతరముండునట్లు ఈమె చేసినది. ఇది మరొకతప్పు. సక్రమాందోళనపద్ధతుల ఈదేశ ప్రజల కీమెనేర్పినది. ప్రజలు నిద్రనుండి మేల్కొని వారి హక్కుల స్థిరపరచుకొనుటకును, నిరంకుశాధికారులకాటంకము కల్పించుటను ఈమె కారణభూతురాలైనందున ప్రభుత్వము వారికి అధికారగౌరవము పోయినదని తలచిరి. సుమారు 25 సంవత్సరములు భారతీయుల సేవలో కాలముగడపుచున్న ఈమెను ప్రభుత్వమువా రన్యాయముగ శిక్షించిరి. ఈమె దేశమునకై చేయుచువచ్చిన అన్ని మంచిపనులకు విఘాతము కల్పించిరి. ఇట్టి అక్రమమైనచర్యవల్ల దేశమున ఆందోళనము మరింత హెచ్చినది. ఆసేతు హిమాచలము నంతట స్వరాజ్యాందోళనమును, ప్రవాస శిక్షనుగూర్చి అల్లరియు రోజునకు రోజు వృద్ధి ఆయెను. ప్రజలాత్మనిశ్చయమును ప్రకటించు పనుల చేయ తొడగిరి. దేశమున కలవరము జనించెను. వృద్ధులైన డాక్టరు సర్ సుబ్రహ్మణ్యఅయ్యరుగారు ముందునిలిచి ప్రజల కుద్బోధించుటకు ప్రారంభించెను. ఆందోళనము దినదినమునకు హెచ్చాయెను. ఉత్తరువు జారీకాగానే తన అనుచరులతో నీలగిరిలో ఉండుటకు నిశ్చయించుకొనెను. పత్రికానిర్వహణ భారమును శ్రీయుత పండరీనాథ కాశీనాథ తెలాంగుగారికప్ప

చెప్పెను. ఈమె నీలగిరివెళ్లుటకుముందే ఆమె మతగ్రంథములు గాని, కరపత్రములుగాని విక్రయించ కూడదని యుత్తరవు జారీచేసిరి. ఇందువల్ల ఈమెకు కలిగిన ద్రవ్యనష్టము అపారము. ఈమెకు ప్రవాసశిక్ష వేయుటవల్ల ప్రవాసమునయున్న యితరులకుకూడ కొంత అనుకూలముకలిగినది. ఇచ్చటిస్థితిగతులు ప్రపంచమంతటికిని తెలియుట కవకాశముకలిగినది.

—— డాక్టరు సుబ్రహ్మణ్యఅయ్యరుగారి సమాధానము. ——

"ఈనెల తే౩-వ దీని. కామన్సుసభలో జరిగిన విషయములను గూర్చి తత్క్షణమే ప్రత్యుత్తర మొసఁగుట అవసరమని గుర్తించుటచే నేను ఈలేఖను వ్రాయ సమకట్టితిని. ఈవిషయము పైకి వ్యక్తిసంబంధముగ కానవచ్చును; గాని కొంచెము యోచించిన నిది ప్రజాక్షేమమునకు సంబంధించినదని సుబోధకము కాకపోదు. నేను. ప్రెసిడెంటువిల్సనుగారికి వ్రాసిన లేఖను గురించి హక్సుగారడిగిన ప్రశ్నకు మాంటేగ్యూగారొసఁగిన ప్రత్యుత్తరమును గూర్చియే నేను నుడువఁబోవుచున్నాను. ఇందును గురించి వార్తాపత్రికలలోను, అందు ముఖ్యముగ ఆంగ్లోయిండియను పత్రికలలోను తీవ్రమగు చర్చ జరుగుచున్నను ఇందు నాకు సంబంధించిన విషయములను నేను విమర్శింపఁ బూనుకొనలేను. ఈవిషయమున కొన్నివారములకు పూర్వము న్యూయిండియాపత్రికలో ప్రకటనములు గావింపఁబడుట వలనను, అవియన్నియు పుస్తకరూపమున నిప్పుడు వెలువడుటచేతను, అస్మద్దేశీయులకు నూతనవిషయములను నేనేమియు తెలుప నక్కఱలేదని యింతవఱకును మిన్నకుంటి; కాని హక్సుగారి ప్రశ్నకు మనకార్యదర్శిగా

ఱాసఁగిన ప్రత్యుత్తరము నన్ను ఈయుత్తరమును లిఖింపఁ బ్రేరేపించినది. ఇంతకుఁ బూర్వము గతడిసెంబరుమాసమున మాంటేగ్యూ, రాజప్రతినిధిగార్లు మదరాసునగరమునకు వచ్చినప్పుడు జరిగినసంగతులను గూర్చియు, 8-2-18-వ తేదీ చెన్నపురి ప్రభుత్వకార్యదర్శి వద్దనుండి వచ్చిన యుత్తరమును గూర్చియు నించుక తెలుపవలసియున్నది.

మాంటేగ్యూ-రాజప్రతినిధి గార్లను సందర్శించుట.

మాంటేగ్యూ రాజప్రతినిధిగార్లను సందర్శించుటకు నియుక్తులైన వారిలో నేనొకఁడనని అనేకులకు తెలియును. నేను నియమితకాలమునకు ప్రభుత్వమువారి గృహమునకుఁ బోయి నాకేర్పఱుపఁబడిన స్థలమున నాసీనుఁడ నైన తోడనే రాజప్రతినిధిగారు తీవ్రముగ సంభాషణమునారంభించుటచే నేను విభ్రాంతమానసుఁడ నైతిని. నా లేఖతో సంబంధించిన ప్రముఖులను గూర్చియు, నన్నుగూర్చియు వారుపలికిన వాక్యములను ప్రకటించుటయందు నేను ఎట్టి రహస్యమును బయలుపఱుచుట లేదు. ఆసంభాషణము రహస్యమని ఎవరును తలంపరు.

ప్రథమముననే రాజప్రతినిధిగారు ఆగ్రహావేశపరవశులై నేను విల్సనుగారికి వ్రాసిన లేఖను గుఱించి మాటాడిరి. నన్ను వారు న్యాయదృష్టితో విలకింపలేదనియు, నన్ను వారు తూలనాడిరనియు నేను అనుకొనవలసివచ్చినది. ఏలనన: నేను అచ్చట రాజకీయవిషయములను చర్చింపఁబోయి యుంటిని; కాని ప్రెసిడెంటు విల్సనుగారికి నేను లిఖించిన కమ్మకై రాజప్రతినిధికి జవాబొసఁగ సంసిద్ధుఁడనై పోలేదు. ఈవిధముగ నాకస్మికముగ నన్నెదుర్కొనుట రాజప్రతినిధికి తగదని నేను

తెలుపక నాకప్పుడు తోఁచినవిధమున వారిప్రశ్నలకు ప్రత్యుత్తర మొసఁగియేయుంటిని. నే నాలేఖ వ్రాసినప్పుడు నిష్కపటహృదయముతోనే వర్తించితి ననియు శ్రీచక్రవర్తిగారి స్నేహితులును, మిత్రమండలివారిసంగ్రామాశయములతో నేకీభవించినవారును అగు అమెరికాప్రెసిడెంటు మూలముననే ఆసమయమున హోమురూలర్లకు క్షేమము గలుగునని అభిప్రాయము నాకు ఉండెననియు నేను వారితో నుడివితిని. అప్పటి పరిస్థితులు ఈవిధముగ నున్నవి. హోమురూలు సమితియందున్న నలుగురు ప్రముఖులలో ముగ్గురు, అనఁగా: అధ్యక్షురాలగు బిసెంటుదొరసానిగారును, కార్యదర్శియగు అరండేలుగారును, కోశాధికారియగు వాడియాగారును, నిర్బంధావాసశిక్షపాలు కాఁబడిరి. అనరరీఅధ్యక్షుఁడనగు నన్నుగూడ స్థానికప్రభుత్వమువా రీవిధముననే శిక్షింతురని వదంతి యెల్లయెడల ప్రబలముగా నుండెను; గావున అప్పు డిచ్చటకు వచ్చి, మఱల తమస్వదేశమగు అమెరికాకు పోవనున్న హోచ్నరుగారియొక్కయు, వారిసతియొక్కయు అగమనమువలన లాభము నందఁదలఁచి, వీరి కమెరికాఖండమున, భారతదేశమునకు ఉపకారము చేయఁగల స్నేహితులు అనేకులు ఉండుట గ్రహించి, వీరు బిసెంటుప్రభృతుల విమోచనమునకై కృషి సలుపఁగలరను విశ్వాసముతో ఆలేఖను రచించి వారిమూలమున విల్సనుగారికి అందఁజేసితిని. ఆలేఖయం దీ దేశప్రభుత్వమువారిచేఁ గావింపఁబడిన దోషారోపణముల నన్నిటికిని తగిన నిశ్చితనిదర్శనములు గలవనియు, అవసరమగు నెడల ఇంగ్లదేశమున నిర్బంధశిక్ష ననుభవించుచున్నవారి హృదయనిర్భేదక

ములగు కడగండ్లను గూర్చి నావద్దనున్న లేఖలను అధ్యక్షున కంపెదనని వ్రాసితిని.

— మదరాసు ప్రభుత్వకార్యదర్శి లేఖ. —

ఈవిషయమై యింక నెక్కుడువిపులముగ వ్రాయనవసరము లేదు. కార్యదర్శిగారిసమక్షమున, వారి అనుమతిని, వారిపక్షమున, రాజప్రతినిధిగారు నావర్తనమునెడల తమ అసంతృప్తిని వ్యక్తపఱిచిరని ఇచటనుడివినఁ జాలును. పిమ్మట నాలేఖను గూర్చి ఇండియా మదరాసు ప్రభుత్వములకు ఎట్టిసంభాషణ జరిగినదో నాకేమియు తెలియదు; గాని చెన్నపురి ప్రభుత్వ కార్యదర్శియొద్దనుండి మాత్రము నా కీలేఖ వచ్చినది.

సెయింటు జార్జికోట, చెన్నపట్టణము, 8-2-1918.

అయ్యా! అమెరికాసంయుక్తరాష్ట్రాధ్యక్షునకు మీరువ్రాసినలేఖయొక్క అచ్చుప్రతులు ఆలోచనసభాసమేతులగు గవర్నరుగారికి అంపఁబడినవి. మెయిలుద్వారా పంపినయెడల ఆ లేఖగమ్యస్థానముచేరదనునుద్దేశముతో హెచ్చ్ హోచ్నరుగారును వారిసతియు ఈలేఖ వ్రాయఁబడిన కొలఁదిదినముల లోపుననే అమెరికాకుఁ బోవుచుండుటచే వారిద్వారా నీలేఖను మీరు పంపిరని తెలియుచున్నది. అయుత్తరమున 24 జూను 1917 అను తేదీ యున్నది. ఈవిషయమున రాజప్రతినిధిగారును, కార్యదర్శిగారును ప్రశ్నించి, మిమ్ము చీవాట్లు పెట్టిరని గవర్నరుగారికిని, వారిసభకును ఎఱింగింపఁ బడినది. ఈస్థితిగతుల లో మీపై నిక నెట్టిచర్యను నడుపకుండుటకుగవర్నరుగారును, వారిసభవారును నిశ్చయించిరి. ఇట్లు,

లయొనల్ డేవిడ్సను, అక్టింగుప్రధానకార్యదర్శి.

మాంటేగ్యూగారు ఎత్తువారిచేతిబిడ్డ.

ఈయుత్తరమువలన ఈవిషయమంతము నొందినదని యెల్లరునుదలంచిరి; గాని దురదృష్టవశమున సంగ్రామమంత్రివర్గము వారి నాయకత్వమున మనసామ్రాజ్యమునకును, హిందూదేశమునకును, అపాయంకరముగ పరిణమించుపరిస్థితులు ఏర్పడుచున్నవి. మన కార్యదర్శి ప్రప్రథమమున నెట్టి ఆశయపూరితుడైనను, భారతభూమియందు అడుగిడినప్పుడే ఇచ్చటి నిరంకుశాధికారుల వలలోఁ దగుల్కొనినాఁడు. ఆంగ్లోయిండియనులును, సిడెంహాము పక్షమువారును, ఈతఁడు చక్రవర్తి మంత్రికిఁ దగినబాధ్యతా గౌరవములతో వర్తింపఁజాలఁడనియు, అచ్చటివారి యిష్టానుసారము ఎత్తువారిచేతి బిడ్డఁడై వర్తించుననియు గ్రహించిరి. జూను 13-వ దీని జరిగిన విషయములను బట్టి ఈసారాంశము తేలుచున్నది.

భావిచర్యానిరోధపరిత్యాగము.

విల్సనుగారికి వ్రాయఁబడిన లేఖను మంత్రివర్గమువారు తమకు కొలఁదికాలము క్రిందటనే పంపిరని రాజప్రతినిధిగారు నాతోఁ జెప్పియున్నారు; గావున కార్యదర్శిగారికి అప్పటికి ఈవిషయమై తెలిసియుండకపోదు. ఒకవేళ వారికి దీనిని గురించి తెలియదనుకొనినను రాజప్రతినిధిగారు నాయెడలఁ గావించిన నిందను వారుకూడ అంగీకరించిరి. చెన్నపురి ప్రభుత్వప్రధానకార్యదర్శియుత్తరువు మాంటేగ్యూ రాజప్రతినిధిగార్ల అనుమతిలేక వెలువడియుండదు. 13-వ దీని పార్లమెంటులో జరిగినవిషయమునై నాపై నెట్టి చర్యను దీసికొనినను అందులకు నేను అంగీకరించుచున్నాను. నామాతృదేశమున

కైన ఎట్టి శిక్షనైన నేనాహ్వానింతును. ఈవిషయము నాదేశ మునకు అంతకును సంబంధించినది. ఇందులకు నేను స్వార్థ త్యాగముతో వర్తింపవనువు దొరకుట నాఅదృష్టమే, గాని వేఱొండుగాదు. నిర్బంధావాసమైనను, ద్వీపాంతరవాసమై నను, మఱి యెట్టి శిక్షయైనను నాకు భయకారకము కాఁ జాలదు. ఈప్రపంచగౌరవముల నాశింపని వయనునందు భారతదేశ స్వరాజ్య సంపాదనమునకై అధికారనిరంకుశత్వము వాతఁ బడుటకంటె నాకు వేఱొండు గౌరవములేదు.

నిరంకుశాధికార పరిపాలనా ఫలితముగ వాటిల్లనున్న అపాయమునుండి బ్రిటిషుసామ్రాజ్యమును సంరక్షించి భారత దేశము నుద్ధరించుటకై గతవత్సరమున నిర్బంధావాసశిక్షలు దేవతలవలన నుద్దేశింపఁబడినవని తలంచెదను. ఈకార్యము దేశమందంతటను ఉత్సాహమును పురికొల్పినది. ఇప్పుడు మఱల దేశము నిద్రావస్థయం దున్నది. మఱల దానిని మేల్కొ ల్పుటకు నాయెడలఁ గావింపఁబడు చర్య కారణభూతమగు నేని నేను ధన్యుఁడను. నాదేశీయులు ఈవిషయమును గ్రహించి బ్రిటిషుసామ్రాజ్యాధీనమై స్వరాజ్యము భారతదేశమునకు లభ్యమగునట్టుల శాస్త్రసమ్మతాందోళనము కావింతురు గాక!

కాక్సుగారి ప్రశ్నకు ఉత్తర మొసంగునపుడు కార్యదర్శిగారు ఉపయోగించిన మర్యాదాహీనమగు భాష స్వీయపక్షసంతృ ప్తికొఱకై కావింపఁబడిన తంత్రముయొక్క ఫలితమని నా అభిప్రాయము; గాని అతఁడు ఈదేశమున నున్నప్పుడు నన్ను నిందించినవిషయము నచ్చటివారి కెఱుకపఱచి తన నిష్కా-

పట్యమును వ్యక్తపరచి యున్నచో ఎంతబాగుండును ? గాని విల్సను గారికి లేఖనంపుటలో లజ్జాకరవిషయ మెద్దియు లేదు."

- డాక్టర్ సర్ సుబ్రహ్మణ్య అయ్యర్.

అమెరికా, ఇంగ్లాండు దేశములలోకూడ సంచలనము కలిగినది. అందుచే 1917 సం॥ సెప్టంబరు తే17-వ దీని ఆమెను అనుచరులతో వదలిపెట్టవలసివచ్చెను. ఇప్పటి ప్రభుత్వమువారీ చర్యవల్ల కొంత యుదారభావమును వ్యక్తపరచిరి. పాలకులకు పాలితులకు పరస్పరానురాగము జనించినది. ఆమె చెన్నపురికిరాగానే ఆమెకు ప్రజలిచ్చిన స్వాగతము వర్ణనాతీతము. ఎన్నియోచోట్ల సభలగావించి ఆమెను గౌరవించిరి. కృతజ్ఞత హిందువుల పుట్టుకతో పుట్టినగుణము కావున ఆమె కుచితరీతిని అన్ని మర్యాదలు వారుజరపిరి. దేశీయమహాసభకు అధ్యక్షురాలినుగ ఆమెను చేయటకన్న హిందువులు చేయతగిన హెచ్చుగౌరవ మేమున్నది. న్యూ ఇండియా సంపాదకత్వమునకు మరల పూనుకొనెను. ఈతరుణమున ఇండియామంత్రి మాంటాగ్యూగారు ఇండియాకు దయచేసిరి. రాజకీయసంఘములవారందరు విజ్ఞాపనల నిచ్చిరి. స్వరాజ్యసమితితరపున విజ్ఞాపనమియిచ్చి మాంటాగ్యూగారితో చాలాసేపు సంభాషించి మనదేశస్థితిగతుల వారికి తెలియచెప్పెను. ఈసత్యాగ్రహము [illegible] పద విని సహించి కార్యక్రమమును మిక్కిలి నైపుణ్యముతో నిర్వహించెను. మహమ్మదీయనాయకులగు మహమ్మదాలీ, షౌకతాలిగార్ల విమోచనకై కృషిచేయ ప్రారంభించెను. గాని ప్రభుత్వమువారేమియు చేసినారుకారు. ఇటీవల ఈమె [illegible] గూర్చి కొంతచెప్పి ఈ గ్రంథమును పూర్తిచేసెదను.

మాంటాగ్యూ-చమ్స్‌ఫర్డు నివేదికము.

దేశమంతట స్వరాజ్యవాంఛతో కలవరపడుచున్నందున వైసరాయిగారును ఇండియా మంత్రిగారును భారతీయులకు కొంతస్వాతంత్ర్యమిచ్చినగాని ప్రభుత్వము నెమ్మదిగ సాగదని భావించి 1917 సం॥ ఆగస్టు తే 20-వ దీని పార్లమెంటున మాంట్యాగుగారొక ప్రకటనను చేసిరి. "స్వపరిపాలనమునిచ్చుట పరమావధియైనను ఒక్కసారిగనిచ్చిన అజీర్ణము పుట్టునుగావున అప్పుడప్పుడు పరిస్థితులపరిశీలించి కొద్దికొద్దిగ మాకిష్టమువచ్చినపుడు యిచ్చెదము; మేము యివ్వతలచినపుడు మీరుపుచ్చుకోవలెనేగాని తొందరపడకూడదు. కొంతకాలమునకు అన్ని హక్కుల మీకిచ్చెదము," అని సెలవిచ్చిరి. మాంట్యాగూగారును వైసరాయిగారును సంప్రతించుకొని ఈసంస్కరణల విషయమై గొప్పరిపోర్టును సిద్ధముచేసి ప్రకటించిరి. దీని నాలోచించుటకు బొంబాయిలో స్పెషల్ కాంగ్రెసుమహాసభ సమావేశమాయెను. నాయకులలో అభిప్రాయభేదములు పుట్టి మాంట్యాగూగారి సలహామీద మితవాదులనిపిలువబడు నాయకులు కాంగ్రెసునుండి చీలిపోయిరి. ఇందువల్ల దేశమునకు కలిగిననష్ట మందరికిని తెలిసియేయున్నది. ఈ మితవాదులు ప్రభుత్వమువారేమిచేసినను వారినెదిరించక, వారితో తోడ్పడుటయే ముఖ్యాశయమని తలచుచున్నారు. ప్రజలసహాయమున శాసన, సామ్రాజ్యసభలలో పదవులసంపాదించుకొని ప్రజాభిప్రాయమునకు విరుద్ధముగ ప్రవర్తించుటయే మంచిదని వీరు తలచుచున్నారు. బొంబాయి స్పెషలుకాంగ్రెస్సున మాంటుఫర్డు నివేదికము ప్రజాభిప్రాయమున కనుగుణముగ లేదని

జాతీయనాయకులు తీర్మానించిరి. ఈసమావేశమున బిసెంటు పాగ్లాని కార్యక్రమమున కేలాటిలోపము లేకుండ అన్ని పనుల నిర్వహించెను. ఆమీద ఢిల్లీకాంగ్రెసులో మనలో ప్రముఖులు కొందరికిని ఈమెకును భిన్నాభిప్రాయములు కలిగి నవి. ఎవరైనను హెచ్చుసంఖ్యాకుల అభిప్రాయమునకు బద్ధులగుట విధియైయుండగా తనపట్టు నెగ్గించవలెనని ఎంతో ఈమె ప్రయత్నించినదిగాని సి. ఆర్. దాస్, మాళవ్యావంటి ప్రజా నాయకులను విపక్షముగ ఈమెనడచుకొనుట ఏటికిఎదురీదినట్లని ఆమెకు తెలియకపోయెను. తనఅభిప్రాయప్రకారము దేశీయ సభవారు నడచుకొనలేదని ఆగ్రహముచెంది, అదిమొదలు నేటి వఱకు దేశీయమహాసభను, మననాయకులను ఎన్నివిధముల దూషింపవచ్చునో అన్నివిధముల దూషించుటకు మొదలు పెట్టెను. కాంగ్రెసుతో కలియక ప్రత్యేక ప్రాతినిధ్యమున సీమకువెళ్లి అచ్చటకూడా కాంగ్రెసు ప్రతినిధులకు ఎన్ని యిబ్బందులు కలిగించవలెనో అన్నికలిగించి మితవాదులతో సఖ్యమేర్పరచుకొని మరల ఇచ్చటికివచ్చెను. సంస్కరణచట్టము వలన ఎట్టిలాభము మనకులేకపోయినను అన్నివేళలదానిపొగ డుటకు ప్రారంభించెను. దేశమంతటికి కలవరము కలిగించిన రౌలట్ చట్టము రద్దగుటకు శ్రీగాంధి మహాత్ముడు ప్రచారము నకుతెచ్చిన సత్యాగ్రహవ్రతమును, శ్రీగాంధిగారిని తూల నాడుటకు ప్రారంభించెను. నాయకశిరోమణియగు శ్రీతిలకు గారిని రోజు న్యూ ఇండియాపత్రికలో దూషించుటయేగాక కాంగ్రెస్సుకు సంబంధించినవారినందరినిదిగదూడ్చుట కెంతో ప్రయత్నములు చేయుచున్నది. తానే ఎల్లప్పుడు రాజకీయాంశ

ములలో అగ్రస్థానమువహించవలెననెడి దురభిమానమును, గాంధివంటిమహనీయులపై అసూయయు ఆమె వ్రాయువ్రాతల లోను, చెప్పుమాటలలోను వెల్లడియగుచున్నది. ఈసందర్భమున శ్రీ కృష్ణాపత్రిక ఈమెనుగూర్చివ్రాసిన 'స్వాతంత్ర్యద్వారము' అనువ్యాసము నుదాహరించి ఈజీవితమును పూర్తి చేయుచున్నాను. ఇకముందు ఈమెవల్ల దేశమునకు మేలుకలుగునో కీడుగలుగునో తెలిసినదికాదు.

——— స్వాతంత్ర్యద్వారము. ———

"బెసెంటమ్మ లోకప్రఖ్యాతివడసిన ప్రవక్త. అసమాన వాక్చాతుర్యముచే సభాస్తారులను బారవశ్యమున ముంచగల నేర్పరి. సమయానుకూలముగ స్వపక్షపరపక్షములను తారుమారుచేయగల రాజనీతి చతురిక. శత్రువులనుగ్గుసేయుటకు ధనవిద్యాబలసంపన్నతల నేకముఖమున ప్రయోగించి సంహారతాండవమున వైరజ్వాలలను వెలిగ్రక్కు శక్తిస్వరూపిణి. ఢిల్లీపుర సభారంగమున నిన్నుమ ప్రదర్శించిన వాక్పటిమయు, అభినయ కౌశలము, రాజనీతి చతురతయు, పరాస్తమైనను ఈమె సాహచర్యమునకు జంకుచుండిన మితవాదులు తుదకు ఆమె సారథ్యము నంగీకరించునటుల చేసికొని ధన్యురాలయ్యెను. శీఘ్రకాలకు పక్షము నోడించుచునిపుతో పునహా మితవాదులపై సైన్యాధిపత్యము నువహించి తనయాంతరంగిక సంతుష్టిని బడయగలిగిన బెసెంటమ్మ ప్రజ్ఞ నిజముగ నిరుపమానమని వేరుగ చెప్పవలయునా?

మితవాదులు రాజకీయ సంస్కరణములు సంతృప్తికరములని వాదించుచుండిరి. వీనిని జయప్రదముగ ననుష్టించిన,

నూతనవరములను బడయగల యోగ్యతకు తార్కాణమగునని చెప్పుచుండిరి. కాని బెసంటమ్మ మాత్రము ఈయుక్తిప్రణాళిక నవలంబించలేదు. క్రియకు మితవాదుల సిద్ధాంతము నంగీకరించుచున్నను, ఆసిద్ధాంతమును జాతీయవాదుల మతము నాశనంచుటకు భావగర్భితమైన రీతిని అనుసరించుచున్నది. మితవాదుల సిద్ధాంతముప్రకారము దేశీయు లెప్పుడు యధికారములను బడయగలెననిన, ప్రకృతసంస్కరణములను జయప్రదముగ నిర్వహించిచూపవలెను. పరీక్షాధికారులగు బ్రిటిషు పార్లమెంటువారు మన ప్రవర్తనను గనిపెట్టి తదనుగుణ్యామైన ఫలితము నొసంగెదరు. మితవాదులు తమ సిద్ధాంతము నీమాటలతో జెప్పకపోయినను, వారి తీర్మానముయొక్క అంతరార్థ మిదియే. మితవాదులు ప్రకృత సంస్కరణములను సంతృప్తికరములని చెప్పుటలో నాలుగు అంశము లిమిడియున్నవి. దేశీయులు ప్రస్తుతము పూర్ణస్వరాజ్యమునకు అర్హులుకారని యొప్పుకొనుట యొకటి. బ్రిటిషు పార్లమెంటువారి పరీక్షకు లోబడుట రెండవది. ఎప్పుడు పరులు పరీక్షాధికారులనుగ నంగీకరించెదమో, అప్పుడే పరుల సంప్రదాయమును లక్ష్యముగ సమ్మతించుట మూడవది. బ్రిటిషు పార్లమెంటువారు మనరాజకీయోన్నతిని నిస్వార్థముతో దోడ్పడెదరను విశ్వాసము నాల్గవది. ఈ నాలుగంశములను హృదయపూర్వకముగ నంగీకరించువారే ప్రకృత సంస్కరణములు సంతృప్తికరములని ప్రశంసింపగలరు.

జాతీయవాదు లీనాలుగంశముల నంగీకరింపరు. దేశీయులు వెంటనే పరిపూర్ణస్వరాజ్యమును బొందుటకు అర్హులు;

హిందూదేశ రాజ్యాంగ పరిణామము బ్రిటిషు పార్లమెంటు పరము చేయకూడదు; భావ్యభివృద్ధి దేశీయ ప్రతినిధి సభలకే వదలివేయవలెను: అని తీర్మానించిన కాంగ్రెసు ప్రతిసందర్భమున దేశీయుల యోగ్యతయెడల అవిశ్వాసమును, బ్రిటిషు వారి రాజ్యాంగ సంప్రదాయముయొక్క ఆధిక్యతను గాలుపుచుండు సంస్కరణములను సంతృప్తికరములని ఎట్లు సమ్మతింప గలదు ? కాంగ్రెసు సూచించిన సంస్కరణములుకూడ దేశీయుల మనోరథమును బూర్ణముగ సిద్ధింపజేయగలవి కావనుమాట నిజమే. కాని కాంగ్రెసు అధికారవర్గముతో రాజీకి దిగుటకై, దేశీయుల వాంఛలను గొంతవఱకు సంకుచితపఱచి, అథమము ఏసంస్కరణము లొసంగిన దేశీయులు సంతృప్తి జెందెదరో వానినే కోరెను. అయినను ఆసంకుచిత ప్రణాళికయందు స్వాతంత్ర్యబీజములు నిమిడ్చియుండెను. హిందూదేశము పూర్ణస్వరాజ్యము బడయుటకు 15 సంవత్సరముల కాలపరిమితిని నిర్ణయించెను. రాజ్యాంగ పరిణామమును పరుల పరీక్షలకు వదలివేయక, దేశప్రతినిధులు హస్తగతము చేయవలెనని నిశ్చయించెను. దేశీయుల మూలస్వాతంత్ర్యములను శాసనరూపముగ సంరక్షించవలయునని తీర్మానించెను. ఈమూడు సూచనలును కాంగ్రెసు స్కీమునకు ప్రాణములు వంటివి. ఈమూడును లేని స్కీము చైతన్యవిగతమైనదని అంగీకరింపక తప్పదు. అట్టి ప్రాణవిహీనమైన సంస్కరణముల కట్టెను బట్టుకొని, "సంతృప్తికరము, సంతృప్తికరము" అని మితవాదులు నృత్యము సేయుచున్నారు. ఈనృత్యమున బాల్గొనని కాంగ్రెసు "ధర్మప్రమాణము"ను గోల్పోయినదని శ్రీనివాసశాస్త్రిగారు వక్కాణింప గలిగిరి.

బెసెంటమ్మగారి సిద్ధాంతమునకును శ్రీనివాసశాస్త్రిగారి సిద్ధాంతమునకును నిజముగ నెట్టివ్యత్యాసమును లేదు; కాని బెసెంటమ్మగారి సిద్ధాంతమును తనవాగ్వైచిత్ర్యముచే మఱుగు పుచ్చి తన రాజనీతిచతురతను జూపుచున్నది. ప్రకృతసంస్కరణములు స్వాతంత్ర్యాలయ ద్వారమును దెరచినవని బెసెంటమ్మగారి విచిత్రసిద్ధాంతము. ఈవాక్యము అలంకారభూయిష్ఠమై భావరంజకముగ నున్నది. కాని, అలంకారముచే నెవరినైన భ్రమింపఁజేయవచ్చును గాని, శ్రీతిలకుపక్షమువారు మాత్రమిట్టి భావోన్మాదులుకారు. మహారాష్ట్రులు కర్మప్రధానులు. సంస్కరణములను శల్యపరీక్షచేసి ఆశాభంగకరములని తేల్చిచెప్పిన తార్కికులు. 193 కోట్లరూపాయల హిందూదేశాదాయములోను 22 కోట్లనైనను సరిగ ప్రజాధీనము చెయ్యని సంస్కరణములని లెక్కచే ఋజువుచేసిన గణితశాస్త్రజ్ఞులు. అట్టివారినా, బెసెంటమ్మ తనవాక్చాతురిచే భ్రమింపఁజేయగల ప్రవక్త. ప్రకృతసంస్కరణములా, స్వాతంత్ర్యాలయముయొక్క కవాటమును దెరచిపెట్టినది?

స్వాతంత్ర్యద్వారమును దెరచుట యన నేమి? వ్యంగ్యాత్మకమైన ఈ వాక్యమునకు బెసెంటమ్మయే వ్యాఖ్యచేయవలసి వచ్చెను. కవాటము బంధింపఁబడినంతకాలము, తలుపును గ్రుద్దుచుంటిమి, కేకలు వేయుచుంటిమి. ఇప్పుడు తలుపు తెరవఁబడినది. ఇక మనము గడపదాటి లోపలకు అడుగిడుటయే శేషించియున్నది. తలుపు తెరచినపిమ్మట తలుపును గ్రుద్దుట పరిహాసాస్పదము; కేకలు వేయుట మరింత పరిహాసాస్పదము. ఇక అన్యుల నపేక్షించవలసిన అవసరము లేదు. ఆందోళనముతో బనిలేదు.

స్వశక్తిచేతనే ముందడుగిడవలెను. మనపురోభివృద్ధి మన కాలిసత్తువమీఁదనే ఆధారపడియున్నది. ఏకీభావముతో తీవ్రమైన నిశ్చయముతో కార్యాతురులమైతిమేని, గర్భగుడిలోనికి త్వరలో ప్రవేశింపఁ గలుగుదుము. అచ్చట స్వాతంత్ర్యదేవత తనంతటతానే ప్రత్యక్షమగును. ఇంకను జాగుసేయు నేల? ఇంకను బరిశీలనలతోడను, వివాదములతోడను కాలయాపన చేయుట యెందుకు? సంస్కరణములను స్వీకరింపుము. హృదయపూర్వకముగ స్వీకరింపుము. వాని నెంతబాగుగ స్వీకరింపగలిగితిమేని అంతత్వరలో గమ్యమును జేరఁగలుగుదుము.

అహా! బెసెంటమ్మగారి వాగ్వైభవము? స్వర్గమును అరచేతిలో జూపుచుండ జాతీయవాదు లింకను ఏల ఆమెకు బాధాక్రాంతులు కారు? జాతీయవాదుల మూలమంత్రము కూడ స్వావలంబనమే కదా! ఆమంత్రమే నేడు బెసెంటమ్మ ముఖతః ప్రతిధ్వనించుచుండ, జాతీయవాదులు పరాఙ్ముఖు లగుటకంటె మహాదోషమేమిగలదు? రౌలట్టుఆక్టు తొలగిపోవలెనా? సంస్కరణములను స్వీకరింపుడు. రౌలట్టుఆక్టు తొలగిపోవును. ప్రెస్ ఆక్టురద్దుకావలెనా? సంస్కరణములను స్వీకరింపుడు. ప్రెస్ ఆక్టు మాయమైపోవును. దేశీయులు తిరిగి శస్త్రధరులగుటకు గోరుచుండిరా? సంస్కరణములను స్వీకరింపుడు. సంస్కరణములు మిమ్ములను సాయుధులనుగ జేయగలును. విదేశవస్తువుల పోటీనుండి దేశీయపరిశ్రమలను సంరక్షింప జూచుకొనుచున్నారా? సంస్కరణములను స్వీకరింపుడు. మీదేశము సకల భాగ్యభోగ్యములతోడను తులతూగును. సంస్కరణములు మీపాలిటి కల్పవృక్షమైయుండ, ఇంగ్లాండులోను, అమెరికా

లోను, ఇంకను ఆందోళననుజరుపవలయునని శ్రీతిలకు ప్రగల్భ ము లాడుచుండెనే. సిగ్గు, సిగ్గు! ఇంతకంటె అవమానకరమైన విషయ మొకటికలదా? జాతీయవాదులు సంస్కరణములను సరిగ బఠించకపోవుటచే పరరాజ్యవ్యామోహమున దగుల్కొ నుచున్నారు. సంస్కరణములను తిరిగి పఠింపుడు. అదుగో సుదూరమున స్వాతంత్ర్య శిఖరము గోచర మగుచున్నది. తలు పులు తెరచి యున్నవి. నడుములు బిగించి, ముకుళితహస్తము లతో లోపలకు ప్రవేశింపుడు.

చాలు! చాలు! బెసెంటమ్మగారి స్వాతంత్ర్యనిర్వచన మెట్టిదియో మాకు దెలియదు. కాని మనరాజకీయ భవితవ్యము పరదేశీయుల హస్తగతమై యున్నంతకాలము పారతంత్ర్యమే కాని స్వాతంత్ర్యమనునది లేదనినమ్ముడు. పదిసంవత్సరముల కొకమారు పార్లమెంటువారు హిందూదేశ రాజ్యాంగ మును బరీక్షించెదరట' పరీక్షితు లెవ్వరను బరీక్షకుని చిత్త వృత్తి ననుసరించి మెలంగుటసహజము. ఈకారణముచేత దేశీ యుల మానసికదాస్యము మరింత బలపడునేగాని, తగ్గజాలదు. హిందూదేశము స్వాతంత్ర్యమును గోరుచున్న దెందుకు? బ్రిటిషుసాంప్రదాయము ననుకరించుటకా? ఆత్మను గోల్పో యినపిమ్మట సామ్రాజ్యము సిద్ధించినను, ఫలమేమని యేసు క్రీస్తువు ప్రశ్నించెను. హిందూదేశము రెండవయింగ్లాండుగ జేయు ఈసంస్కరణములు స్వాతంత్ర్యద్వారమును మఱింత దృఢముగ బంధించు గడియలేయగును. పూర్ణస్వాతంత్ర్యము నను గడు వేర్పరచని సంస్కరణములు,—దేశముయొక్క భవితవ్యమును దేశీయ ప్రతినిధిసభల హస్తగతము చెయ్యని

సంస్కరణములు,— దేశీయుల మూలస్వాతంత్ర్యములను సంరక్షింపని సంస్కరణములు,— స్వాతంత్ర్య నిలయము యొక్క ద్వారమును జేరమనని చెప్పుటకంటె అన్యార్థమొకటి లేదు. బెసెంటమ్మ తన వాగ్జాలమునంతను ఉపయోగించినను అనృతను సత్యము కాజాలదు. ఎట్టియలంకారములును బ్రజల నిక భ్రమయందు బడ వేయజాలవు. ప్రజలు సంస్కరణముల రహస్యము గుర్తెరిగిరి. లోపలశాంతి, సంతృప్తి, భద్రత లే నప్పుడు, మంగళగీతము లెన్ని పాడినను లాభమేమి?"

మనదేశాభివృద్ధిని గోరి తత్సాధనము లయిన కార్యముల మనకు నుపదేశించుచుండుటయే కాక యీామె మన ప్రభువు లయిన బ్రిటిషు దొరతనమువారిని వారి పరిపాలన యందుఁ గలలోపములఁ జూపుచు, మనకును మన దేశమునకును శ్రేయోదాయకము లయిన పనులఁ జేయునటుల వారిని ప్రోత్సాహపఱచుచు మన కత్యంతోపకారమును గావింపు చుండెను.

ఇకనైనను ఇటీవలి నడవడి మార్చుకొని ప్రజానాయకులతో కలిసి మెలసి అసూయనుమాని మన దేశమునకు మేలు కలుగు తీరున ప్రవర్తించుట యుక్తమని తలచుచున్నాము.

ఈవిధమున జనులయోగక్షేమములకునై తనకష్టసుఖములఁ బాటింపక లోకహితముగ సంచరించు నీపుణ్యశీలకు నింకనూ నాయురారోగ్యము లొసంగి యీమెను సర్వేశ్వరుఁడు కంటికి ఱెప్పవోలె నరసి రక్షించుచుండుఁగాత!

ఓం తత్సత్.

'వావిళ్ల' ప్రెస్, తండయార్పేట, చెన్నపురి.—1920.

	ప్రతి1-కి రూ.	అ.
అరేబియన్ నైట్స్‌కథలు, చక్కనికూర్పు ...	1	4
తారాభాయి, చక్కనినవల ...	0	12
ఆనందమఠ, నవల, నూతనముద్రితము ...	0	12
ఐవన్హో, నవల ...	0	8
మదాలస ,, ...	0	10
మనోహరి, టి. యస్. రామశాస్త్రిగారిది ...	0	12
టిప్పుసుల్తాన్ ...	1	4
సీతారామము, శ్రీతల్లాప్రగడ. సూర్యనారాయణరావుగారిది ...	1	2
ఉన్మాదిని నవల ...	0	4
రాధారాణి ,, ...	0	4
పరమానందశిష్యులకథలు ...	0	3
తెనాలిరామలింగనికథలు, జీవితము ...	0	4
భోజునికథలు ...	0	8
విక్రమార్కునికథలు ...	0	6
బేతాళునికథలు ...	0	6
వైద్యులకథలు ...	0	4
తాతాచార్యులకథలు ...	0	6
నలుగురుమంత్రులకథలు ...	0	2
ఆయిదుగురుదొంగలకథ ...	0	6
నీతిచంద్రిక, చిన్నయసూరిగారిది, చిన్నసైజు	0	8
పంచతంత్రము, వచనము, సులభశైలి ...	0	8
రామదాసచరిత్ర, చక్కనికూర్పు, మంచికాగితములు, ఇందు శ్రీరామదాసుగారి ప్రతిమకూడకలదు ...	0	12

Sri Vemana Grandhalayam
Telaprole. Kistna dt.

	ప్రతి 1-కి రూ.	అ.
సూరతు కాంగ్రెస్సు ఉపన్యాసములు ...	0	2
శ్రీ గైక్వారుగారి ఉపన్యాసములు ...	0	2
శ్రీ లాలా లాజపతిరాయి జీవితము ...	0	2
శ్రీరామానుజాచార్య చరిత్ర ...	0	4
స్వామిరామతీర్థ జీవితము ...	0	2
శాలివాహనచరిత్ర ...	0	3
రామకృష్ణపరమహంసచరిత్ర ...	0	2
బాలగంగాధరతిలకుగారిచరిత్ర, ప్రతిమతో ...	0	4
శ్రీ గోపాలకృష్ణ గోఖ్లేగారిజీవితము ,, ...	0	2
శ్రీ మహాదేవ గోవింద రానడే జీవితము ,, ...	0	2
శివాజీచరిత్ర ,, ...	0	8
శ్రీ బుద్ధచరిత్రము ,, ...	0	4
సోదరి నివేదిత జీవితము ,, ...	0	2
లార్డు క్లైవు జీవితము ,, ...	0	8
అనిబిసెంటుచరిత్ర ,, ...	0	4
శ్రీశంకరాచార్యచరిత్ర, ,, ...	0	3
శ్రీ వేమనయోగిజీవితము. ,, ...	0	2
దాదాభాయి నౌరోజీచరిత్ర ,, ...	0	2
శ్రీ కరంచంద్ గంధిజీవితము ,, ...	0	2
శ్రీ గైక్వారుగారిజీవితము ,, ...	0	2
వివేకానందస్వామి జీవితము ,, ...	0	2
శ్రీకృష్ణదేవరాయచరిత్ర ,, ...	0	3
శ్రీ గురుజాడ శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవిజీవితములు	3	0

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA 103 B 159
పుస్తకం పేరు	ఆలిబి సెంటయ్యగారి జీవితము
తారీఖు	25/10/24
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Ruksana
పేజీలు విడదీసినది	Ruksana.
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	thasin
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	Good.